


G.Rajesh B.E.,
Chief Editor

# INB టైమ్స్

తెలుగు దినపత్రిక
మేము సామాన్యుడు వైపు






Published from : TELANGANA | Editor: G.RAJESH | మంగళవారం 22 ఆగస్టు 2023 | inbtimes.com | సంపుటి: 1 సంచిక: 415 పేజీలు- 6
www.inbtvnews.com | PUBLISHED FROM HYDERABAD, KHAMMAM, WARANGAL, MEDAK , MAHABUB NAGAR, NALGONDA, KARIM NAGAR. | Email: inbtimes@gmail.com


# ఒకేసారి 115 మంది

## అభ్యర్థుల జాబితా విడుదల

అసెంబ్లీ ఎన్నిలకు బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన
ప్రజల కోరిక మేరకే కామారెడ్డిలోనూ పోటీ..
అక్టోబర్ 16న వరంగల్ సింహగర్జనలో మ్యానిఫెస్టో
అభ్యర్థులను ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్
ఏడుచోట్ల అభ్యర్థుల మార్పు.. ఐదుగురు కొత్తవాళ్లు
దేశ చరిత్రలో బహుశా ఇదే మొదటిసారి
సింహం సింగిల్‌గానే.. పొత్తుల్లేనేలేవ్
కేవలం ఐదు స్థానాల్లో అభ్యర్థుల మార్పు
2 సీట్లలో వారసులకు.. నాలుగు పెండింగ్



హైదరాబాద్,
రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం తెలంగాణ భవన్‌లో ప్రకటించారు. మొత్తం 119 నియోజకవర్గాలకుగాను 115 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. టికెట్లు వచ్చినవారందరికీ అభినందనలు తెలిపారు. నర్సాపూర్, జనగామ, నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ప్రస్తుతం ప్రకటించినవాటిలో ఏడు చోట్ల వివిధ కారణాలతో సిట్టింగ్ అభ్యర్థులను మార్చారు. కొత్తవారికి అవకాశం కల్పించారు. వేములవాడ, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, వైరా, కోరుట్ల, ఉప్పల్ స్థానాల్లో కొత్తవారిని బరిలోకి దింపుతున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మహాసముద్రంలాంటిదని, పార్టీలో ఎందరో సమర్థులైన నాయకులున్నారని తెలిపారు. టికెట్లు రానివాళ్లు నిరాశచెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

### భవిష్యత్తు పాడుచేసుకోవద్దు

ప్రస్తుతం ప్రకటించిన స్థానాల్లో ఏడింటిలో వివిధ కారణాల వల్ల అభ్యర్థులను మార్చాల్సి వచ్చిందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఈసారి ఐదుగురు కొత్తవాళ్లకు అవకాశం ఇచ్చామని వెల్లడించారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వానికి సంబంధించి న్యా యవివాదం ఉన్న నేపథ్యంలో తప్పనిసరై అభ్యర్థిని మార్చాల్సి వచ్చిందని తెలిపారు. దీంతోపాటు బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, వైరా, కోరుట్ల, ఉప్పల్‌లో అభ్యర్థులు మారినట్టు చెప్పారు. కామారెడ్డిలో స్వయంగా తానే పోటీ చేస్తున్నందున అది మార్పు కిందికి రాదని పేర్కొన్నారు. టికెట్లు రానివాళ్లు నిరాశ చెందాల్సిన అవసరం లేదని సూచించారు. టికెట్ రానివారు చిన్నబుచ్చుకొని, హడావుడి పడి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని కోరారు. పార్టీ అంటే సముద్రం వంటిదని, అనేక అవకాశాలు ఉంటాయని తెలిపారు. 'పార్టీలో ఉండండి, అభ్యర్థులను గెలిపించుకోండి, తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయి. రాజకీయ జీవితం అంటే ఎమ్మెల్యే మాత్రమే కాదు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్సీ ఇలా అనేక పదవులు ఉన్నాయి. గతంలో కూడా ఇచ్చినం' అని పేర్కొన్నారు. తాజా జాబితాలో అతి పెద్ద వయస్కుడు వనమా(78) కాగా, అతిపిన్న వయస్కురాలు బడే నాగజ్యోతి(29).
అభ్యర్థుల ప్రకటన అనంతరం మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సీఎం కేసీఆర్ సమాధానమిచ్చారు. టికెట్ల కేటాయింపుపై అసమ్మతి వినిపిస్తున్నది కదా? బీఆర్ఎస్ ఎంతో క్రమశిక్షణతో కూడుకున్న

మిగతా 2లో

## ప్రజలకు సంక్షేమం.. ఉద్యోగులకు భరోసాగా

# ప్రభుత్వ పాలన

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి



విజయవాడ
ప్రజలకు సంక్షేమం.. ఉద్యోగులకు భరోసాగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ విజయవాడలో సోమవారం నిర్వహించిన 21వ రాష్ట్ర మహాసభలో సీఎం జగన్ మాట్లాడుతూ%ౌ% ఏపీలో ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీగా ఉంటోందని సీఎం జగన్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే 1.35 లక్షల నూతన ఉద్యోగాల భర్తీతో పనిభారం తగ్గించామని వివరించారు. టీడీపీ ప్రభుత్వం కనీసం ఊహించని ఆర్టీసీని తాము అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో విలీనం చేసినట్లు తెలిపారు. చంద్రబాబు ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే జీతాలు పెంచగా.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఉద్యోగులకు పెంచిన జీతాలు చెల్లిస్తోందని వివరించారు. ఉద్యోగుల జీతాల ఖర్చు

మిగతా 2లో

## రెండు చోట్లా కేసీఆర్ ఓటమి ఖాయం



అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే
కామారెడ్డిలో కేసీఆర్ పనిపడతాం
కామ్రేడ్లను కరివేపాకులా తీసేశారు
శ్రీకాంతాచారి తల్లిని అవమానించారు
టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

2లో..



## శ్రీవారి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు

హైదరాబాద్, ఆగస్టు 21
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారయ్యారు. ఈ ఏడాది అధికమాసం కారణంగా రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 18 నుంచి 26 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ ప్రకటించింది.బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సెప్టెంబర్ 18 నుంచి

మిగతా 2లో

# బిజెపిలో టచ్ లో 22 మంది నేతలు

త్వరలో భారీ చేరికలుంటాయన్న ఈటల



హైదరాబాద్,
అసెంబ్లి ఎన్నికలు దగ్గరపడు తున్న వేళ పార్టీలోకి భారీగా బలమైన నేతలను చేర్చుకుని క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు తెలంగాణ బీజేపీ సన్నద్ధమైంది. ఈ నెల 27న బీజేపీ అగ్రనేత కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వస్తున్న నేపథ్యంలో పార్టీలోకి కొత్త నేతల వలసలపై ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం మూహర్తం

## లక్కు.. కిక్కు

### రెండు మద్యం టెండర్లను దక్కించుకున్న భార్యాభర్తలు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 21:
సూర్యాపేట మండలం తాళ్లకాంపాడ్ గ్రామానికి చెందిన మిర్యాల శ్రీధర్‌రెడ్డి, స్వాతి దంపతులకు మద్యం టెండర్ల లక్కీ డ్రాలో అదృష్టం వరించింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణాలకు గా నూ వారి పేరు మీద చెరొకటి చొప్పున టెం డర్లు వేశారు. సోమవారం అధికారుల సమక్షంలో తీసిన లక్కీడ్రాలో రెండూ వారికే వచ్చాయి. దాంతో ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



# ఒకేసారి 115 మంది

## అభ్యర్థుల జాబితా విడుదల

మొదటిపేజీ తరువాయి

పార్టీ. ఇక్కడ యుద్ధాలు, ముష్టిఘాతాలు ఉండవు. మేం ఒక్కసారే 115 సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తున్నామంటేనే అర్థం చేసుకోవాలి. ఎక్కడో ఒకటిరెండు చోట్ల ఉంటే.. దానిని భూతద్దాలు పెట్టి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి వాటిని మేం పట్టించుకోం. అది వాళ్లకే రివర్స్ కొడుతుంది. పార్టీ పూర్తిస్థాయి వడపోత తర్వాత ఈ జాబితాను సిద్ధం చేశాం. అనేక సర్వేలు నిర్వహించాం. అక్కడక్కడ ఏమైనా అసంతృప్తులు ఉంటే అవే సర్దుకుంటాయి. ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీ హైమాండ్ మాట్లాడుతుంది. పెద్దలు కేశవరావుతో కలిసి త్రీమెన్ కమిటీ వేస్తాం. ఆ కమిటీ అన్నీ చూసుకుంటుంది.

**కొత్తగా ఇప్పుడెందుకు రెండుచోట్ల నుంచి పోటీ చేస్తున్నారు?**

తెలంగాణలోని అనేక నియోజకవర్గాలవారు నన్ను పోటీ చెయ్యమని అడిగారు. కరీంనగర్‌లో పోటీ చెయ్యమని కోరారు. కామారెడ్డి ఎమ్మెల్యే, నిజామాబాద్‌కు చెందిన మంత్రి నన్ను ప్రత్యేకంగా కలిశారు. ఈ సారి మా దగ్గరి నుంచి పోటీచేయాలని కోరారు. వారి కోరిక మేరకే కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నాను.

**మిగిలిన అభ్యర్థుల జాబితా ఎప్పుడు ప్రకటిస్తారు?**

పెండింగ్‌లో ఉన్న స్థానాలకు అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తాం.

ఉద్యమ పార్టీ అని చెప్పి, పూర్తిగా రాజకీయ పంథాతో వ్యవహరిస్తున్నారు?

2014లోనే ఇదే తెలంగాణ భవన్‌లోనే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పినప్పుడే రాజకీయ పంథా గురించి కూడా స్పష్టంగా చెప్పాను. తెలంగాణ రాష్ట్ర సాధనతో ఉద్యమ లక్ష్యం నెరవేరిందని, ఇక నుంచి తెలంగాణను తీర్చిదిద్దడం కోసం రాజకీయ పంథాతో వ్యవహరిస్తామని చెప్పాను.

**కాంగ్రెస్, బీజేపీ రెండింటిలో మీకు ప్రత్యర్థి ఎవరని భావిస్తున్నారు?**

మాకు ఎవరూ పోటీ అని అనుకోవడం లేదు. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో 95 నుంచి 105 సీట్లలో గెలువబోతున్నామంటే.. ఇక పోటీ ఎక్కడిది? బీఆర్ఎస్, మజ్లిస్ కలిసే ముందుకెళతాయి. పాత రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని 29 స్థానాల్లో అన్నింటినీ బీఆర్ఎస్, మజ్లిస్ కైవసం చేసుకుంటాయి. ఇక్కడ వేరేవాళ్లకు అవకాశమే లేదు.

**కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ప్రకాశ్ జవదేకర్ అంటున్నారు?**

ప్రపంచమే గర్వించే ప్రాజెక్టు కాళేశ్వరం. అలాంటి దానిపై ఎందుకు ఈ అర్థం పర్థం లేని మాటలు? అసలు ప్రకాశ్ జవదేకర్ ఏం మాట్లాడతడో కూడా తెల్వదు. తోక తెల్వదు.. తొండం తెల్వదు. అసలాయనకు ఏం తెలుసని అట్ల మాట్లాడేది? ఇంకెన్నిసార్లు ఇలాంటి అర్థంపర్థం లేని మాటలు?

గెలుపుపై చాలా విశ్వాసంతో ఉన్నారు? ఏంటి మీ నమ్మకం?

తెలంగాణ అనతికాలంలోనే అనేక రంగాల్లో దేశానికే తలమానికంగా మారింది. ఇది మేం చెప్పేదేం కాదు. నీతిఅయోగ్ నివేదికలు స్పష్టం చేశాయి. పార్లమెంట్‌లో అనేక మంది కేంద్ర మంత్రులు లిఖిత పూర్వకంగా సమాధానాలిచ్చారు. ఈ దేశంలో ప్రతి ఇంటికి నల్లానీళ్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. సంక్షేమం, విద్యుత్తు వినియోగం, ఐటీ డెవలప్‌మెంట్.. ఇలా అనేక రంగాల్లో మనమే నంబర్ వన్. ఇచ్చిన మాట నిలుబెట్టుకోవడంలో వందశాతం సక్సెస్ అయ్యాం. వీటన్నింటినీ చూసి ప్ర జలు తప్పకుంటా మళ్లీ మమ్మల్నే ఆదరిస్తారు.

మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడికి సీటు ఇవ్వకపోతే పోటీ చెయ్యనని చెప్తున్నారు?

బీఆర్ఎస్ విజనరీ పార్టీ. ఎంతో క్రమశిక్షణ ఉన్న పార్టీ. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా సహించేది లేదు. వాళ్లు ఎంత పెద్దోట్కళ్లైనా సరే క్షమించే ప్రసక్తే లేదు. డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటాం. ఆ తర్వాత వాళ్ల ఖర్మ వాళ్లదే.

దేశ రాజకీయాల్లో మార్పు రావాలంటున్నారు.. ఎలా?

ఔట్ ఆఫ్ ది బాక్స్ వెళ్లి పనిచేసిన దేశాలే ప్రగతి సాధిస్తున్నట్టు రుజువు అవుతున్నది. మన దేశంలో బీఆర్ఎస్ పార్టీయే ఇందుకు ఉదాహరణ. బీఆర్ఎస్ ప్రభుత్వం ఔట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించి పనిచేయడంవల్లే నేడు తెలంగాణ రాష్ట్రం దేశంలో అనేక రంగాల్లో ఎంతో ముందంజలో ఉన్నది. ఔట్ ఆఫ్ ది బాక్స్ వెళ్లి పనిచేయడంవల్లే మేము గెలుస్తాం, ప్రజలను గెలిపిస్తాం. ఇటువంటి పని మొత్తం దేశంలో జరగాల్సి ఉన్నది. ఎన్నికల తరువాత ఎంతో సమయం ఉంటుంది. అప్పుడు దేశమంతా పర్యటించేందుకు ప్రయత్నిస్తా. మహారాష్ట్రతోపాటు పలు ఇతర రాష్ట్రాలను కూడా వెళ్తాను. నా కృషిని కొనసాగిస్తా.

నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వలేదు కదా?

కరోనా, నోట్లరద్దు బాగా దెబ్బకొట్టాయి. అందుకే ఇవ్వలేకపోయాం. భవిష్యత్తులో ఆలోచన చేస్తాం.

**జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు ఎప్పుడు ఇస్తున్నారు?**

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ప్రక్రియ చివరి దశలో ఉన్నది. కొన్ని పత్రికలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రగతిపై విషం చిమ్ముతున్నాయి. వారికి మాత్రం ఇచ్చేది లేదు. పాలు పోసి పామును పెంచలేం కదా? జర్నలిస్టులు ఒక విజన్‌తో ఉండాలి. కీలుబొమ్మలా ఉండకూడదు కదా? దేశంలో తెలంగాణతో పోల్చుకోవడానికి భయపడే రాష్ట్రాలు ఎన్నో ఉన్నాయి. రైతు రుణమాఫీ చెయ్యడం లేదని రాశారు. మొన్న ఒక్కసారే రూ.20 వేలకోట్ల మాఫీ చేసినం. ఇప్పుడు ఆ పేపర్ తలకాయ ఎక్కడ పెట్టుకుంటది? అదొక పేపరా? దానికొక విలువ ఉన్నదా? తెలంగాణ ద బెస్ట్ గ్రోత్ ఇన్ ఇండియా అని ఆర్‌బీఐ రిపోర్టులు వచ్చినయ్. నీతి ఆయోగ్ రిపోర్టులు వచ్చినయ్. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులు లిఖితపూర్వకంగా చెప్పారు. అయినా సరే.. మేము ఒకటే రొడ్డ కొట్టుడు కొడతం అంటే ఎలా? అదేం పేపర్.. దిక్కుమాలిన పేపర్? ఎంతోకొంత మారాలి కదా? ఉద్యమ సమయంలోనే ఈ రాష్ట్రంలో కొన్ని కుల పత్రికలు, ఇంకొన్ని గుల పత్రికలు ఉన్నాయని చెప్పాను.

# బిజెపిలో టచ్ లో 22 మంది నేతలు

మొదటిపేజీ తరువాయి

ఖరారు చేసి నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలపై కన్నేసింది. కొత్తగా ఎమ్మెల్యే టికెట్ ఆశించి రాదని నిర్ధారించుకున్న, ఇప్పటికే ఒకటి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ఈసారి బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి టికెట్ ఆశించినా మొండిచేయి ఎదురవడం ఖాయమనుకుంటున్న నేతలను తనవైపు తిప్పుకునేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది.

ఈ నేపథ్యంలో 22 మంది కీలక నేతలు బీజేపీలో చేరబోతున్నారంటూ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చేసిన ప్రకటన ఇప్పుడు రాజకీ యంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అదే సమయంలో ఖమ్మం నుంచి త్వరలో బీజేపీలోకి చేరికలుంటాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇటీవల ఖమ్మం పర్యటనలో ప్రకటించారు. అదే సమయంలో నిర్మల్‌లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు కూడా బీజేపీలో 22మంది ఎమ్మెల్యేలు చేరనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో బీజేపీలో చేరబోయే ఆ 22 మంది నేతలు ఎవరు? అన్న దానిపై రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

రేపో మాపో అధికార బీఆర్ఎస్ తొలి జాబితా, ఆ తర్వాత కొద్ది రోజుల్లో కాంగ్రెస్ జాబితా కూడా విడుదల కానుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బీజేపీలోకి చేరికలు పెరు గుతాయని ఈటల సన్నిహిత నేతలు చెబుతున్నారు. బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీల తొలి అభ్యర్థుల జాబితాలో చోటుదక్కక పోవచ్చని ఖాయమని భావిస్తున్న ఉమ్మడి వరంగల్‌తోపాటు నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువు రు నేతలు ఇప్పటికే ఈటల రాజేందర్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర రాజకీయాల్లో ఈటల ప్రాధాన్యత ఉన్న నేత కావడంతోపాటు సీఎం కేసీఆర్ సన్నిహితుడిగా రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేయడమే కాకుండా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పలు పార్టీల అసం తృప్త నేతలతోపాటు ఉద్యమకారులు కూడా అవసరమైతే బీజేపీ టికెట్ కోసం ఇప్పటికే ఈటలతో మాట ముచ్చట పూర్తిచేసినట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్‌లో ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో అసమ్మ తి రగులుతుండడంతో ఈటల రాజేందర్, రఘునందన్‌రావు చేసిన 22 మంది ముఖ్యనేతల చేరిక ప్రకటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 27న అమిత్ షా తెలంగాణ పర్యటన.. ఖమ్మంలో బహిరంగసభ నేపథ్యంలో బీజేపీలో భారీగా చేరికలు ఉండేలా ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈటల నేతృత్వంలో కసరత్తును పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈటలతో టచ్‌లో ఉన్న తమ నేతలు ఎవరనేది కాంగ్రెస్, అధికార బీఆర్ఎస్ ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మరో మూడు నెలల్లో అసెంబ్లి ఎన్నికలు జరగనుండడం తో బీజేపీని అభ్యర్థుల కొరత వేధిస్తోంది. బలమైన అభ్యర్థుల కోసం ఆ పార్టీ వేచిచూస్తోంది. టికెట్ ఆశించి రిక్తహస్తం ఎదు ర్కొన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలే బీజేపీలో చేరనున్నట్లు బీజేపీలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు నేతలు పోటీపడుతున్న నియోజకవర్గాలు అధికంగానే ఉండడంతో టికెట్ రాని అసంతృప్త నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకుని అసెంబ్లి ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం అసెంబ్లి ఎన్నికలకు బీజేపీ దూకుడుగా సన్నద్ధ మవుతోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలను అన్ని అసెంబ్లి నియోజక వర్గాలకు బీజేపీ పంపించింది. అదే సమయంలో బీజేపీ ముఖ్యనేతలు జిల్లాల్లో విస్తృతంగా పర్య టనలు చేస్తున్నారు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ధర్నాలు, నిరసనలతో రాష్ట్ర వ్యాప్తంగా హోరెత్తిస్తున్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు

మొదటిపేజీ తరువాయి

అక్టోబర్ 2 వరకు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు అష్టాదశ పాదపద్మారాధన, తిరుప్పావడై, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేయనున్నారు. ముందస్తుగా ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను నిర్దేశిత వాహన సేవకే అనుమతిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల అంకురార్పణ కారణంగా అక్టోబర్ 14న సహస్రదీపాలంకార సేవను రద్దు చేసినట్టు టీటీడీ ప్రకటించింది.

## ప్రజలకు సంక్షేమం.. ఉద్యోగులకు భరోసాగా ప్రభుత్వ పాలన

మొదటిపేజీ తరువాయి

గతంలో రూ. 1,100 కోట్లు ఉండగా.. నేడు రూ. 3,300 కోట్లకు చేరిందని, అయినా ఉద్యోగుల కోసం చిరునవ్వుతో భరిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, గ్రామ స్వరాజ్య సాధనలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని తమ ప్రభుత్వ సక్సెస్ కు కారణం ఉద్యోగులే అంటూ సీఎం జగన్ పేర్కొన్నారు.

ప్రభుత్వం మీద అసాధ్యమైన బరువు పడకుండా, ప్రభుత్వాలు భారం ఎక్కువై భవిష్యత్తులో చేతులు ఎత్తేసే పరిస్థితి రాకుండా, అదే సమయంలో ఉద్యోగులు రిటైర్డ్‌మెంట్ అయిన తరువాత చిరునవ్వుతో బతికేలా, వారికి న్యాయం జరిగేలా ఏకంగా చట్టాన్ని ఆర్డినెన్స్‌కు కూడా పంపించామని సీఎం జగన్ తెలిపారు. ఈ పెన్షన్ స్కీమ్ రాబోయే రోజుల్లో దేశమే మన రాష్ట్రానికి వచ్చి కాపీ కొట్టి అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల మీద, ఉద్యోగుల మీద ఎవరి మీదా గత పాలకులు ప్రేమ లేదని, వీరు చేసే రాజకీయ విమర్శలు, రెచ్చగొట్టే వీరిమాటల్ని, కట్టు కథల్ని నమ్మవద్దని సీఎం కోరారు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగుల మీద పగబట్టి భౌతిక దాడులు జరుపుతున్నారని, 47మంది పోలీసులపై పుంగనూరులో దాడి చేశారని గుర్తు చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి మంచి చేసే విషయంలో ఎక్కడా వెనక్కు తగ్గే పరిస్థితి లేదని సీఎం ఉద్ఘాటించారు. 2 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 2022 జూలై 1కి సంబంధించిన డీఏ దసరా పండుగ నాడు అందరికీ ఇచ్చే కార్యక్రమం చేస్తానని సీఎం హామి ఇచ్చారు.

## రెండు చోట్లా కేసీఆర్ ఓటమి ఖాయం

**హైదరాబాద్, ఆగస్టు 21**

వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పోటీ చేసే రెండు సీట్లలోనూ ఆయన ఓటమి ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన గొంతులో ఓటమి భయం స్పష్టంగా కనిపించిందన్నారు. సిటింగ్ ఎమ్మెల్యేలందరికీ సీట్లు ఇవ్వకపోవడం, కేసీఆర్ కూడా రెండు చోట్లా పోటీ చేస్తుండడం ఆ పార్టీ ఓటమి పాలవుతుందనడానికి సంకేతమన్నారు. కేసీఆర్ గజ్వేల్ నుంచే పోటీ చేయాలని, సిటింగ్ ఎమ్మెల్యేలందరికీ టిక్కెట్లు ఇవ్వాలని తాను విసిరిన సవాల్‌ను ఆయన స్వీకరించలేదని, ఆయన కామారెడ్డిలోనూ పోటీ చేస్తూ సిట్టింగ్‌లనూ మార్చారన్నారు. తద్వారా ఓటమిని ఒప్పుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ వామపక్షాలను కరివేపాకులా తీసిపారేశారని వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కామారెడ్డికి పారిపోతున్నారని తాను మొదట్నుంచీ చెబుతున్నానన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా చూస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమైందన్నారు. రాష్ట్రంలో 2/3 మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పారిపోవాలనుకుంటే సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలు ఉన్నాయని, కానీ ఒక మైనారిటీ నేత ఉన్న కామారెడ్డికి వెళ్లడం మైనారిటీలను అవమానించడమేనన్నారు. మాజీ మంత్రి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే షబ్బీర్ అలీ తెలంగాణ ప్రజలకు ఎనలేని సేవ చేశారని ఈ సందర్భంగా కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అంతా షబ్బీర్ అలీకి అండగా ఉంటుందని, కామారెడ్డిలో కేసీఆర్ పనిపడతామన్నారు. సూర్యాపేట సభలోనూ కేసీఆర్‌లో ఓటమి భయం స్పష్టంగా కనిపించిందన్నారు. 'మధ్యాహ్నం 12.03 గంటలకు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల అని ప్రచారం చేసుకున్నారు. కానీ ఆ ముహూర్తంలో లిక్కర్ షాపుల డ్రా తీశారు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రాధాన్యత ఏంటో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాల'న్నారు. రుణమాఫీ పేరుతో కేసీఆర్ అతి తెలివితేటలు ప్రదర్శించారని, రూ.99,999 వరకు మాత్రమే మాఫీ చేసి రూ.11 వేల కోట్లు మిగుల్చుకున్నారని ఆరోపించారు.

**కేటీఆర్ అమెరికా పర్యటన అందుకే..**

ఓఆర్ఆర్ లీజుతో ఐఆర్బీ నుంచి వచ్చిన సొమ్ముతో పెట్టుబడి పెట్టేందుకు కేటీఆర్ అమెరికా వెళ్లారని రేవంత్ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో మందు, పైసలు పంచబోనంటూ మంత్రి కేటీఆర్ చేసిన సవాలును స్వీకరిస్తున్నామన్నారు. 119 మంది కాంగ్రెస్ అభ్యర్థులతో పైసలు, మందు పంచబోమంటూ ఒట్టు వేయిస్తానని, దానికి కేటీఆర్ కూడా సిద్ధమేనా అని ప్రశ్నించారు. సూర్యాపేట సభలో శ్రీకాంతాచారి తల్లిని నిలబెట్టి కేసీఆర్ అవమానించారన్నారు.



## జనగామ టికెట్ ఆశిస్తూ మంత్రి హరీష్ రావును కలిసిన ఆప్కో మాజీ చైర్మన్ మండల

**ఐ ఎన్ బి టైమ్స్,చేర్యాల్ ఆగస్ట్ 21:**
రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నుంచి తాను టికెట్ ఆశిస్తున్నట్లు ఆప్కో మాజీ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనేత మండల శ్రీరాములు తెలిపారు.పద్మశాలి వర్గానికి చెందిన ఆయనకు జనగామ టికెట్ ఇవ్వాలని పద్మశాలి కుల సంఘం నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఆదివారం ఆర్థిక, వైద్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావును హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.గతంలో వివిధ హోదాలో తాను ప్రజల కోసం పనిచేసిన అనుభవం ఉందని జనగామ,చేర్యాల ప్రాంతాల రాజకీయ పరిస్థితులు,ప్రజా అవసరాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్నానని జనగామ నుంచి టికెట్ కేటాయిస్తే గెలిచి వస్తానని చెప్పినట్లు మండల శ్రీరాములు పేర్కొన్నారు.ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్ రావు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హరీష్ రావు చెప్పినట్లు మండల శ్రీరాములు తెలిపారు.

## ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్‌కు కృత్రిమ కాలు



**ఐ ఎన్ బి టైమ్స్ ఖమ్మం ఆగస్టు21:**
ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడు గ్రామంలో, ఈ ఏడాది ఏప్రియల్ 12 న జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సంకల్ప హాస్పిటల్ లో చికిత్స పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ ఎడమ కాలు కోల్పోవడం జరిగింది. పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ ప్రత్యేక చోరవ తీసుకొని సాధ్యమైనంత సహజంగా కనిపించేలా కృత్రిమ కాలు కు శాఖ పరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించడంతో నడవలేని స్థితిలో వున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ కు జర్మనీ టెక్నాలజీతో ఒట్టోబాక్ కంపెనీ రూపొందించిన సుమారు తొమ్మిది లక్షల విలువ చేసే హైడ్రాలిక్ డ్యాంపర్ తో కూడిన కృత్రిక కాలు అమర్చేలా చర్యలు తీసుకొన్నారు. అదేవిధంగా ఒట్టోబాక్ కంపెనీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు హైదరాబాదులో శిక్షణ తీసుకొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారిని కలసిన నవీన్ మాట్లాడుతూ సకాలంలో ఆసుపత్రికి చేరుకొని వైద్యులతో మాట్లాడి చికిత్స అందించి, కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించి, కృత్రిమ కాలు ఏర్పాటుకు సహకారించిన పోలీస్ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీ ప్రసన్న కుమార్ , సిఐ చిట్టిబాబు, అర్ ఐ శ్రీశైలం పాల్గొన్నారు.



# ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో సీఎం జగన్‌లో ఫ్రస్టేషన్: మాజీ సీఎం చంద్రబాబు

**ఐ ఎన్ బి టైమ్స్ అమరావతి ఆగస్టు 21:**
సొంత వైఫల్యాలతో ప్రజల్లో సీఎం జగన్ వ్యతిరేకత మూటగట్టుకున్నారని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో జగన్‌లో ఫ్రస్టేషన్ పెరిగిందన్నారు..ఆ మానసిక ఆందోళనతో 60 ఏళ్లుగా తెలుగు ప్రజలకు సేవ చేస్తున్న మార్గదర్శిని వేధించేందుకు లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. పలు సంస్థలను నిర్వీర్యం చేసే సైకో చర్యలకు పాల్పడిన జగన్ రెడ్డి.. ఇప్పుడు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను కూల్చాలని కుట్ర పన్నుతున్నారంటూ మండిపడ్డారు. ఈ మేరకు చంద్రబాబు ట్వీట్ చేశారు..వైకాపా మోసాలు, నీచాలు ఎండగడుతున్న 'ఈనాడు'ని ఓ నియంతలా జగన్ వేధించి భయపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. తనకు భజన చేసే మీడియాకు మాత్రం అమిత ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. జర్నలిజం, సాహిత్యం, విద్యలో రామోజీరావు చేసిన సేవలకు భారతదేశ రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ లభించిందని గుర్తుచేశారు. అంతటి మహావ్యక్తి లక్ష్యంగా వైకాపా కుట్రపూరిత చేస్తున్న దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. జగన్ చేసిన దుష్ట ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ఇక ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. చెడు ఎప్పుడూ ఓడిపోతుందని, మంచిదే అంతిమ విజయమన్నారు. తెలుగు ప్రజలంతా రామోజీరావుతోనే ఉన్నారని గుర్తుంచుకోవాలని చంద్రబాబు స్పష్టంచేశారు..



## కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడెప్పుడు ఓటు వేయాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు..!

- ప్రజా ఆశీస్సులు, దీవెనలు ఉన్నవారికే అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు
- కేసీఆర్ డిమాండ్ కు తెలంగాణ సోనియమ్మ తెలంగాణ ఇవ్వలేదు
- ప్రజల మనోభావాలను గౌరవించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారు
- రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ దే అధికారం
- తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- కొత్తగూడెం మున్సిపాలిటీ నుంచి కాంగ్రెస్ లోకి భారీ చేరికలు



**ఐ ఎన్ బి టైమ్స్ కొత్తగూడెం ఆగస్టు 21 :** ఎన్నికలు ఎప్పుడొస్తాయా... కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడెప్పుడు ఓటు వేయాలని యావత్తు తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం సందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ఏరియాలోని 6,7,8,9,10,11,12 మొత్తంగా ఏడు వార్డులకు చెందిన బీఆర్ఎస్ సహా ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి పొంగులేటి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ జాబితా లాగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా ఉండదన్నారు. ప్రజా ఆశీస్సులు, దీవెనలు ఉన్నవారిని పరిగణలోకి తీసుకుని, అన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తుందని తెలిపారు. కేసీఆర్ డిమాండ్ చేశాడనో, ఆయన దీక్ష చేశాడనో తెలంగాణ ను సోనియమ్మ ఇవ్వలేదన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించి... వారి ఆత్మగౌరవాన్ని అగౌరవపరచొద్దనే సదుద్దేశ్యంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సోనియమ్మ ఇచ్చారన్నారు. తెలంగాణలో అధికారం కోల్పోతామని తెలిసినా... ఆంధ్రప్రదేశ్లో ఉనికి చాటుకోలేమని తెలిసినా ప్రజల ఆశ, ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది, కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, దళిత బంధు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు ఇలా ఎన్నో వాగ్దానాలను నేరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక ఇళ్లు లేని ప్రతి పేదవానికి రూ. 5లక్షల విలువ చేసే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రతి మెనిఫెస్టోను ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాక చిత్తశుద్ధితో అమలు పరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొంగులేటితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉకంటి గోపాలరావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, నాగ సీతారాములు, యర్రం శెట్టి ముత్తయ్య, శివారెడ్డి, మోహన్ రావు, ఆకునూరి కనకరాజు, రామలక్ష్మణ్, రామనాథం, భద్రయ్య, చింతలపూడి శేఖర్, సర్పంచులు శేఖర్, లాలు, శ్రీను, శంకర్, లక్కినేని సాయి, కల్లూరి కుమార్, సమ్మయ్య, మోహన్, స్వప్న, రాజశేఖర్, పాషా, సుమ, బోయిన విజయ్, బాణోత్ కుమార్, బాలు, మూడు మోహన్, కమ్మ, సత్తి, వశ్యాబాణత్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## సుభిక్ష ఆగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ.....




**ఐ ఎన్ బి టైమ్స్ చేర్యాల్ ఆగస్టు 21:**
సోమవారం రోజున చేర్యాల పట్నంలో సుభిక్ష ఆగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులు ఆత్మహత్యల కుటుంబాలకు కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరిగింది.సుభిక్ష ఆగ్రీ ఫౌండేషన్ గత 6సం,రాల,నుండి జనగాం మరియు సిద్దిపేట జిల్లాలో రైతులు ఆత్మహత్యల కుటుంబాల అభ్యున్నతి మరియు జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పనిచేస్తుంది ఇందులో భాగంగా మే, జూన్ మాసంలో జనగామ జిల్లా తరిగొప్పుల మరియు సిద్దిపేట జిల్లా చేర్యాలలో రెండు కుట్టుమిషన్ల శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ మరియు కుట్టు మిషన్లు పంపిణీ చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గరిడి నరేందర్, భాగ్యనగర్ వేణుగోపాల్ (హైదరాబాద్) ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఉమేష్ రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ సూరయ్య, సాగరిక, మొబిలైజర్ సంతోష్ మరియు సభ్యులు పాల్గొన్నారు..

## రాబోయే ఎన్నికల్లో బిజెపి గెలుపు పక్కా: బసవ కళ్యాణ్ ఎమ్మెల్యే శరణు సలగార్



**ఐ ఎన్ బి టైమ్స్ నారాయణఖేడ్ ఆగస్టు 21:**
అవినీతి పార్టీలైన బీ ఆర్ ఎస్, కాంగ్రెస్ పతనం ఖాయం అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్పఅన్నారు. నారాయణఖేడ్ లో వారం పాటు జరగనున్న ఎమ్మెల్యే ప్రవాస్ యోజనకార్యక్రమంలో పాల్గొన్న విజయ పాల్ రెడ్డితెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అవినీతి, అరాచకాలు పెచ్చు మీ, మూడు నెలల్లో జరిగే ఎన్నికల్లో ఆ పార్టీ రాజకీయ పతనం ఖాయమని కర్ణాటక రాష్ట్రం బసవ కళ్యాణ్ ఎమ్మెల్యే శరణు సలగార్ అన్నారు. భారతదేశానికి అద్భుత పాలన అందిస్తూ చిన్న అవినీతి కూడా లేకుండా మచ్చలేని నాయకుడిగా నరేంద్ర మోడీ గారు ప్రపంచంలోనే పేరు గాంచారని ఆయన వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ గారి నేతృత్వంలో నారాయణఖేడ్ లో కూడా బిజెపి గెలుపు పక్కా అని ఆయన జోస్యం చెప్పారు. బిజెపి మచ్చలేని పార్టీ అని, దేశ భవిష్యత్తు బిజెపి మీదనే ఆధారపడి ఉందని, అదేవిధంగా తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి రావలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఎన్నికల వరకు నారాయణఖేడ్ లోనే ఉండి నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కేడర్ ను సమాయత్తం చేస్తానని ఆయన చెప్పారు.

# ఏడు నెలల గర్భిణీకి అబార్షన్!

**● అనుమతించిన సుప్రీంకోర్టు ● కేసు సుదీర్ఘ వాయిదాపై హైకోర్టుపై అసహనం ● అత్యాచార బాధితురాలికి ఊరట**



**న్యూఢిల్లీ:** 27 వారాల గర్భవిచ్ఛిత్తికి గుజరాత్‌కు చెందిన మహిళను సుప్రీం కోర్టు సోమవారం అనుమతించింది. వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక వ్యక్తి ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతో సదరు బాధితురాలు గర్భం దాల్చింది. ఈ క్రమంలో జస్టిస్ బీవీ నాగరత్న, ఉజ్జల భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆమెకు ఊరట కల్పించింది సోమవారం లేదా మంగళవారం ఉదయం 9 గంటలకు ఆసుపత్రి లో చేరి గర్భవిచ్ఛిత్తి చేయించుకోవాల్సిందిగా బాధితురాలికి సూచించింది. పిండానికి ప్రాణం ఉన్న పక్షంలో అది జీవించి ఉండేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను సదరు ఆస్పత్రి కల్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అంతకుమునుపు శనివారంనాడు కేసుపై ప్రత్యేక విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. బాధితురాలి అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు సుదీర్ఘకాలానికి వాయిదా వేయడం పట్ల ఆందోళన, అసహనం వ్యక్తం చేసింది. ''వైద్య నివేదిక అందుకున్న తర్వాత కేసును 12 రోజుల తర్వాత అంటే ఆగస్టు 23కు హైకోర్టు వాయిదా వేయడం విడ్డూరంగా ఉంది. ఇలాంటి కేసుల్లో ఆలస్యమయ్యే ప్రతిరోజూ అత్యంత కీలకమైందనే వాస్తవాన్ని విస్మరించింది'' అని శనివారంనాటి ఉత్తర్వు లో సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. 26 వారాల గర్భవిచ్ఛిత్తికి పిటిషనర్ చేసుకున్న అభ్యర్థనపై న్యాయపరమైన అనుమతిని మంజూరు చేయడానికి హైకోర్టు నిరాకరించింది.



# కాశీ క్షేత్రంలో బ్యాటరీ వాహనాలు

**● ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి వాహనాలు అందజేసిన జీవీఎల్ నరసింహారావు**

**న్యూఢిల్లీ,** కాశీ క్షేత్రంలో విశ్వనాథ్ ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం బ్యాటరీతో నడిచే వాహనాలను నగర యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు తన ఎంపీ-లాడ్స్ నిధుల నుంచి వీటిని కొనుగోలు చేసి నగర యంత్రాంగానికి అందజేశారు. సోమవారం వారణాసిలోని విశ్వనాథ్ ఆలయం 4వ నెంబర్ గేట్ వద్ద ఎంపీ జీవీఎల్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారణాసి నగర మేయర్ అశోక్ తివారీ, వారణాసి జిల్లా మేజిస్ట్రేట్ ఎస్. రాజలింగం, వారణాసి చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హిమాన్షు నాగ్‌పాల్‌తో పాటు శ్రీతారకరామ ఆంధ్ర ఆశ్రమం నిర్వాహకులు సుందర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. కాశీ విశ్వనాథుడి దర్శనానికి వచ్చే యాత్రికుల్లో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు క్యూలైన్లలో నడవలేక ఇబ్బంది పడుతున్న విషయం ఎంపీ జీవీఎల్ దృష్టికొచ్చింది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో ఇలాంటివారిని బ్యాటరీతో నడిచే గోల్ఫ్ కార్ట్‌లలో తీసుకెళ్తుంటారు. ఆ తరహా వాహనాలను ఆలయాల్లోనూ వినియోగంలోకి తీసుకొస్తే బావుంటుందన్న ఆలోచనతో జీవీఎల్ తొలిదశలో తన ఎంపీ-లాడ్స్ నిధుల నుంచి మూడు వాహనాలను కొనుగోలు చేసి దేవాలయానికి అందించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ జీవీఎల్ నరసింహారావు కాశీ విశ్వనాథుడికి ఈ రకంగా సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ముఖ్యంగా తెలుగు ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు కాశీ విశ్వనాథుని దర్శనం మరింత సులభతరం అయ్యేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయని అన్నారు.

# మిసైల్ టు మ్యూజిక్.. మహిళలు లేనిదెక్కడ?



**న్యూఢిల్లీ:** వివిధ రంగాల్లో మహిళలు తమకు తామే సాటి అనే రీతిలో రాణిస్తున్నందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు.సోమవారం ఇక్కడ సైనికుల సతీమణుల సంక్షేమ సంఘం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మిస్సైళ్ళ నుంచి మ్యూజిక్ (క్షిపణుల రంగం నుంచి సంగీత రంగం వరకూ) మహిళలు అన్ని రంగాల్లో తమ సామర్థ్యాన్ని రుజువు చేసుకుంటున్నారని ఆమె ప్రశంసించారు. ఇంతటి మహోన్నతమైన శక్తిని సొంతం చేసుకుంటున్న మహిళలందరికీ తన అభినందనలని ఆమె అన్నారు. ఆర్మీ అధికారిని వివాహం చేసుకున్న మహిళా పారిశ్రామిక వేత్త,జార్ఖండ్‌కి చెందిన టీచర్ తమ అనుభవాలను వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఈరోజుల్లో బాగా రాణిస్తున్నారనీ,లాభాలను ఆర్జించేట్టు తమ సంస్థలను నడిపిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు.ఇది నిజంగా మహిళాలోకానికే గర్వకారణమని ఆమె అన్నారు.మహిళల కృతనిశ్చయం, పట్టుదల వల్లే ఇది సాధ్యమవుతోందని ఆమె అన్నారు.నారీశక్తి ఎంత గొప్పదో ఈ మహిళలంతా రుజువు చేస్తున్నారని ఆమె అన్నారు.

# పంజాబ్‌లో 29 కేజీల హెరాయిన్ స్వాధీనం



**ఫిరోజ్ పూర్:** పంజాబ్ పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్లు సంయుక్తంగా నిర్వహించిన గాలింపులో పాకిస్తాన్‌కి చెందిన మత్తు మందుల స్మగ్లింగ్ ముఠా పట్టుబడింది. ఈ ముఠా సభ్యుల నుంచి హెరాయిన్‌ను భద్రతాదళాలు స్వాధీనం చేసుకు న్నాయి.ఈ ముఠా సభ్యులు పారిపోతుండగా, భద్రతాదళాలు కాల్పులు జరిపాయి. ఈ ముఠాలో ఒక వ్యక్తి కాలికి గాయమవడంతో వారు పట్టుబడ్డారు. ఈ ముఠా సభ్యుల్లో ఇద్దరు పాకిస్తానీయులు ఉన్నారు. వీరు ఫిరోజ్‌పూర్ జిల్లా ఘట్టీ మాటర్ గ్రామం వద్ద పట్టుబడ్డారు. వీరి వద్ద 29 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పంజాబ్ పోలీసు డైరెక్టర్ జనరల్ గౌరవ్ యాదవ్ తెలియజేశారు. ఫజిల్కా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారని ఆయన చెప్పారు. ఈ ప్రాం తంలో ఇంత పెద్ద మొత్తంలోమాదక ద్రవ్యాలు పట్టుబడటం ఇదే ప్రథమమని ఆయన చెప్పారు.

# మానవ మేధ కళాకృతులకే కాపీరైట్ వర్తింపు



**న్యూఢిల్లీ:** మానవేతర శక్తితో రూపొందించే ఆర్ట్ వర్క్‌లపై కాపీరైట్ కుదరదని అమెరికాకి చెందిన ఓ జిల్లా జడ్జి బేరీ ఓ హేవెల్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన కళాకృతులకు కాపీ రైట్ వర్తించదని ఆమె స్పష్టం చేశారు. కళాకృతులు మానవ మేధకు సంబంధించినవనీ, కాపీరైట్ వాటికే ఉంటుందని ఆమె అన్నారు. కృత్రిమ మేధ ఎప్పు డూ కృత్రిమమేనని ఆమె స్పష్టం చేశారు. మనుషు లు సృజియించే కళాకృతులకే అమెరికా కాపీరైట్ చట్టం వర్తిస్తుందన్నారు. మానవ మేధస్సుతో పని లేకుండా కళాకృతులు, కళాఖండాలు తయారవుతున్నవాట నిజమేననీ, ముఖ్యంగా డిజైన్లు, ఇతర కళారీతులు వాడుకలోకి వస్తు న్నాయనీ, వాటికి కాపీరైట్ చట్టం వర్తించదని ఆమె స్పష్టం చేశారు.

# చంద్రుడిపై విక్రమ్ ల్యాండింగ్ పక్కా!




వేగాన్ని తగ్గించి దక్షిణ ధ్రువంపై దిగేందుకు సిద్ధం



**● సేఫ్ ప్లేస్ కోసం అన్వేషణ ● ఇప్పటికే ఛాయాచిత్రాల విడుదల ● జాబిల్లి యాత్ర సక్సెస్ అయితే ఆర్థికంగా ఇస్రో మరింత బలోపేతం ● ప్రపంచ దేశాల వైపు ఇస్రో చూపు**



**అమరావతి,** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు కనీవినీ ఎరగని రీతిలో అద్భుతమైన విజయాన్ని అందించే దిశగా విక్రమ్ ల్యాండర్ అడుగులు వేస్తోంది. మరికొన్ని గంటల్లో సరికొత్త చరిత్ర సృష్టించబోతోంది. అందుకోసం జాబిల్లి చెంతకు మరింత చేరువైన విక్రమ్ తన వేగాన్ని తగ్గించి సేఫ్‌గా ల్యాండ్ అయ్యేందుకు అనువైన ప్రదేశాన్ని అన్వేషిస్తోంది. ఇప్పటికే జాబిల్లికి 25 కిలోమీటర్ల నుంచి 135 కిలోమీటర్ల దగ్గరలో ఉన్న ల్యాండర్ బుధవారం సాయంత్రం 6.05 గంటలకు చంద్రుని దక్షిణ ధృవంపై అడుగుపెట్టనుంది. ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లను ల్యాండర్ సిద్ధం చేసుకుంటోంది. జాబిల్లికి రెండోవైపు ఉండే ప్రదేశాన్ని ల్యాండర్ తన కెమెరాలతో బంధించి అందుకు సంబంధించిన ఛాయాచిత్రాలను కూడా ఇస్రోకు పంపింది. ఇప్పటివరకు వేగంగా అంతరిక్ష ప్రయాణాన్ని సాగించిన విక్రమ్ ల్యాండర్ జాబిల్లికి అత్యంత సమీపంలోకి చేరుకునేకొద్దీ తన వేగాన్ని తగ్గించుకుంటూ తన యాత్ర లక్ష్యాలకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. మరికొద్ది గంటల్లోనే గమ్యం చేరుకుని తనలో అనుసంధానమైన రోవర్‌తో కలిసి జాబిల్లిపై పరిశోధనను మొదలుపెట్టబోతోంది. దీంతో ప్రపంచ దేశాలన్నీ ఇస్రోవైపే చూస్తున్నాయి. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం పూర్తి స్థాయిలో విజయవంతమైతే ఇస్రో ఆర్థిక రూపురేఖలు కూడా మారనున్నాయి. ప్రతిష్టాత్మకమైన చంద్ర యాన్-3 యాత్ర సంపూర్ణంగా సక్సెస్ అయితే ఇస్రో ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

భారత అంతరిక్ష ప్రయోగ రంగంలో చంద్రయాన్-3 అత్యంత కీలకమైంది. గతంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చంద్రయాన్-1, చంద్రయాన్-2 ప్రయోగాలను చేపట్టింది. చంద్రయాన్-1 ప్రయోగాన్ని 2008లో విజయవంతంగా చేపట్టగా, 2019లో చేపట్టిన చంద్రయాన్-2 విఫలమైంది. ప్రయోగం విజయవంతం అయినప్పటికీ సుదీర్ఘ ప్రయాణం తర్వాత తన పనిని ప్రారంభించాల్సిన రోవర్ చంద్రునికి అత్యంత సమీపానికి చేరుకునేలోపే ఒరిగిపోయింది. దీంతో ఇస్రోతో రోవర్‌కు సంబంధాలు తెగిపోయాయి. ఆ స్థానంలో తిరిగి చంద్రయాన్-3 ప్రయోగాన్ని చేపట్టాలని ఇస్రో గతంలోనే ప్రకటించింది. ఐదేళ్లు పూర్తి కాకముందే జాబిల్లి యాత్రను ఓ సవాల్‌గా తీసుకుని భారత శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రయోగంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు చంద్రయాన్-2లో చోటుచేసుకున్న లోపాలను పూర్తిగా అధిగమిస్తూ జాబిల్లి యాత్రను నూటికి నూరు శాతం విజయవంతం చేసేలా పక్కా ప్రణాళికతో చంద్రయాన్-3 ప్రయోగాన్ని చేపట్టారు.

### ఇస్రో ప్లాన్-బీ 27కు వాయిదా వేసే అవకాశం?

చంద్రుడిపై కీలకమైన చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు ప్లాన్-బీని ఇస్రో సిద్ధం చేసింది. ''ఆగస్టు 23వ తేదీన విక్రమ్ చంద్రుడిపై దిగడానికి 2 గంటల ముందు ల్యాండర్ పనితీరు, చంద్రుడిపై పరిస్థితులు ప్రాతిపదికగా చంద్రుడిపై దిగడానికి ఇది అనుకూలమైన సమయమా కాదా అనేది నిర్ణయిస్తాం. ఒకవేళ పరిస్థితులు అనుకూలించని పక్షంలో ఆగస్టు 27న చంద్రుడిపై విక్రమ్ ల్యాండింగ్ ఉంటుంది'' అని అహ్మదాబాద్ లో ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ ఎం దేశాయ్ అన్నారు.

### వేగం తగ్గి.. సేఫ్ ప్లేస్ కోసం అన్వేషణ..

గత 43 రోజులుగా అంతరిక్షంలో సుదీర్ఘ ప్రయాణాన్ని సాగిస్తున్న విక్రమ్ ల్యాండర్ జాబిల్లి చెంతకు చేరుకుంది. మరికొన్ని గంటల్లో చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టబోతోంది. అయితే చంద్రుడిపై అడుగు పెట్టి, ఆ తర్వాత ఆన్వేషణ మొదలుపెట్టే ముందు దక్షిణ ధృవంపై అనువైన ప్రదేశాన్ని ల్యాండర్ గుర్తించే పనిలో ఉంది. రాళ్లు, రప్పలు వంటి ప్రదేశాల్లో కాకుండా అనువైన ప్రాంతంలో అడుగు పెట్టి ఆ తర్వాత రోవర్‌ను బయటకు తీసుకురావాలని యోచిస్తోంది. బుధవారం సాయంత్రం 5.45 గంటల నుంచి 6.05 గంటలలోపు జాబిల్లిపై అడుగుపెట్టడంతో పాటు రోవర్‌ను కూడా బయటకు తీసుకువచ్చి రెండు కలిసి తన అధ్యయనాన్ని మొదలుపెట్టనున్నాయి. 14 రోజుల పాటు దక్షిణ ధృవంపై అధ్యయనం చేసి అక్కడి సమాచారంతో పాటు పలు ఛాయాచిత్రాలను కూడా ఇస్రోకు పంపనున్నాయి.

### విక్రమ్‌కు.. ఆర్బిటర్ స్వాగత సందేశం

చంద్రుని చుట్టూ 10వేల చ.కి.మీ.ల కక్ష్యలో పరిభ్రమిస్తున్న చంద్రయాన్-2 మిషన్‌కు చెందిన ప్రదాన్ అనే ఆర్బిటర్‌కు చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్‌కు మధ్య పరస్పర సమాచార అనుసంధానం ఏర్పడిందని ఇస్రో తెలిపింది. ఈసందర్భంగా విక్రమ్‌కు ప్రదాన్ స్వాగతం పలుకుతున్నట్టుగా ''వెల్‌కమ్, బడ్డీ!'' అనే సందేశం పంపించిందని పేర్కొంది. విక్రమ్ సాఫ్ట్ ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారం బుధవారం సాయంత్రం 5.20 గంటలకు మొదలవుతుందని తెలిపింది.

### ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం..

జాబిల్లి యాత్ర సంపూర్ణంగా విజయవంతమైతే ఇస్రోకు రెండు రకాలైన ప్రయోజనాలు చేకూరనున్నాయి. అత్యంత కీలకమైన యాత్రను సక్సెస్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించడంతో పాటు ఇస్రో ఆర్థిక వ్యవస్థ కూడా మరింత బలోపేతం కానుంది. స్వదేశీ ఉపగ్రహాలను విదేశాల నుంచి ప్రయోగించే స్థాయి నుంచి విదేశీ ఉపగ్రహాలను స్వదేశం నుంచే క్షేమంగా అంతరిక్షంలోకి పంపే స్థాయికి ఇస్రో ఎదిగింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో వివిధ దేశాలకు చెందిన ఉపగ్రహాలను షార్ నుంచి ఇస్రో పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా అంతరిక్షంలోకి పంపుతుంది. దీంతో వాణిజ్యపరమైన ప్రయోగాల సంఖ్యకూడా క్రమేణా పెరుగుతోంది. అత్యంత కీలకమైన జాబిల్లి యాత్ర సంపూర్ణంగా సక్సెస్ అయితే ప్రపంచ వ్యాప్తంగా పలు అగ్రదేశాలు సైతం తమ దేశాలకు చెందిన ఉపగ్రహాలను ఇస్రో ద్వారానే అంతరిక్షంలోకి పంపేందుకు పోటీపడే అవకాశం ఉంది. అదే జరిగితే ఇస్రో ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు కూడా మారనున్నాయి.

## విక్రమ్ నుంచి చంద్రుని కొత్త ఫొటోలు

చంద్రునిపై కాలు మోపడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్న చంద్రయాన్-3 మిషన్‌కు చెంది విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ చంద్రునిపై భూమి నుంచి ఏ మాత్రం కనిపించకుండా, భూమికి సుదూరంగా ఉండే బిలాలను ఫొటోలు తీసి పంపించిందని ఇస్రో సోమవారం తెలిపింది. చంద్రునిపై కాలుమోపడం కోసం చంద్రునిపైన ఎలాంటి బండ రాళ్ళు లేదా లోతైన కందకాలు లేని సురక్షితమైన ప్రాంతాన్ని గుర్తించడంలో విక్రమ్‌కు సహకరించే ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా(ఎల్‌హెచ్‌డీఏసీ) సుదూరంగా ఉండే బిలాలను ఫొటోలు తీసింది. ఇదే కెమెరా గతవారం హేన్, బోస్ ఎల్, మారే హుమ్‌బోల్డ్ టియనుమ్, బెల్‌కోవిచ్ బిలాలను గుర్తించి ఫొటోలు తీసి పంపించింది. చంద్రుడు ఒక కక్ష్యలో నిరంతరాయంగా తిరుగుతున్న కారణంగా చంద్రుని అర్ధగోళం ఎప్పుడూ కూడా భూమి నుంచి కనిపించకుండా ఉంటుంది. చంద్రుడి దక్షిణ ధృవంపైన బుధవారం సాయంత్రం 6.04 గంటలకు విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ దిగడానికి ముహూర్తం ఖరారైంది. విక్రమ్ సేఫ్ ల్యాండింగ్ చేసిన పక్షంలో అలాంటి ఒక ఘనతను సాధించిన నాలుగు దేశాల్లో ఒకటిగా అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ చేరుతుంది.

## ల్యాండింగ్‌పై పూర్తి నమ్మకం

**ఐఐఎస్సీ శాస్త్రవేత్త రాధాకాంత్ ధీమా**

పటిష్ఠమైన కాళ్లతో ఉన్న విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ చంద్రునిపై దిగడంపై 99.9 శాతం నమ్మకంతో ఉన్నానని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో ఏరోస్పేస్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రాధాకాంత్ పధి తెలిపారు. వేగానికి నియంత్రించుకోలేక విక్రమ్ ల్యాండర్ జారిపడిన కారణంగానే చంద్రయాన్-2 విఫలమైందని అన్నారు. అందులో అల్‌గోరిథమ్ వైఫల్యం కూడా ఉందని చెప్పారు. చంద్రయాన్-3 విషయానికి వచ్చేసరికి అలాంటి లోపాలను సరిదిద్దారని, ప్రస్తుతం విక్రమ్ కాళ్లు మరింత బలిష్ఠంగా ఉన్నాయని రాధాకాంత్ తెలిపారు. చంద్రయాన్-2, చంద్రయాన్-3 వ్యోమ నౌకలను అంతరిక్షానికి పంపించడంలో రాధాకాంత్ ప్రమేయం ఉంది. చంద్రయాన్-2పై ఇస్రో శాస్త్రవేత్తలు అప్పట్లో అతి ఆత్మవిశ్వాసంతో ఉన్నారని ఏరోస్పేస్ శాస్త్రవేత్త చెప్పారు. అంతా విఫలమైపోయినప్పటికీ చంద్రుడిపైకి విక్రమ్ దిగేలా చంద్రయాన్-3 మిషన్‌కు రూప కల్పన జరిగిందని తెలిపారు. చంద్రయాన్-2 విక్రమ్‌కు ఒక కంప్యూటర్ ఉంటే చంద్రయాన్-3 విక్రమ్‌కు రెండు కంప్యూటర్లు ఉన్నాయని ప్రొఫెసర్ రాధాకాంత్ తెలిపారు. పైన చెప్పిన కారణాలతో చంద్రునిపైకి విక్రమ్ నిస్సందేహంగా దిగుతుందని ఆయన ధీమాగా చెప్పారు.

# అవినీతిమయం.. కుంభకోణాల శకం!

**అదే కాలంలో పేదల హక్కులు, సొమ్ములు లూటీ గత ఐదేళ్లలో పేదరికం నుంచి 13.5 కోట్ల మందికి విముక్తి - కొత్త టీచర్లతో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ:** 2014 సంవత్సరానికి ముందు కాలమంతా అవినీతి, కుంభకోణాల శకం అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అదే శకంలో పేదల హక్కులు, నగదు దోపిడీకి గురయ్యాయని తెలిపారు. కానీ ప్రస్తుతం ప్రతి ఒక్క పైసా వారి ఖాతాల్లోకి నేరుగా చేరుతోందని అన్నారు. ఇదే సమయంలో నీతిఅయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ గడచిన ఐదేళ్ళలో 13.5 కోట్ల మంది భారతీయులు దారిద్ర్య రేఖకు దిగువన ఉండే వర్గం నుంచి వెలుపలకు వచ్చారని తెలిపారు. పన్నులు చెల్లించేవారి సంఖ్య పెరిగిందని, అది తమ సొమ్మును సక్రమంగా వినియోగమవుతుందనే విధంగా ప్రభుత్వం పట్ల ప్రజల విశ్వాసాన్ని చూపుతోందని చెప్పారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ముఖ్యమంత్రి రైజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద కొత్తగా నియమితులైన టీచర్లను ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. 2014లో రూ.4 లక్షలుగా ఉన్న భారతీయుల సగటు ఆదాయం నేడు రూ.13 లక్షలకు చేరుకుందని తెలిపారు. ప్రజలు అల్పాదాయ వర్గం నుంచి అధికాదాయ వర్గానికి చేరుకుంటున్నారని చెప్పారు. దేశంలోని అన్ని రంగాలు బలోపేతం చెందిఉపాధి అవకాశాలను



కల్పిస్తున్నాయని చెప్పారు. 2014లో ప్రపంచంలో 10వ స్థానంలో భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఐదవ స్థానానికి చేరుకుందని తెలిపారు. పెట్టుబడులు ఉపాధి అవకాశాలను సృష్టించాయని, 2014 తర్వాత దేశంలో కొత్తగా ఐదు లక్షల ఉమ్మడి సేవా కేంద్రాలు ఏర్పడ్డాయని, అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ''నేడు నియామక పత్రాలను టీచర్లు ఈ చరిత్రాత్మక కాలంలో బోధనకు సంబంధించిన ఒక ముఖ్యమైన బాధ్యతను వారి భుజస్కంధాలపై వేసుకుంటున్నారు. భారత్ భావి తరాలను తీర్చిదిద్ది, వారికి సరికొత్త దిశను చూపించే బృహత్తరమైన బాధ్యత టీచర్లపైన ఉంది'' అని ప్రధాని అన్నారు. ఒక అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి చేసిన సంకల్పాన్ని నెరవేర్చడంలో కీలకమైన భాగస్వామ్యం కలిగిన కొత్త టీచర్లు జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) అమలులో ఒక ప్రధానమైన పాత్రను పోషిస్తారని తెలిపారు. ఎన్ఈపీలో భవిష్యత్ టెక్నాలజీతో పాటుగా సంప్రదాయ జ్ఞానసముపార్జనకు సైతం సమ ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ప్రాథమిక విద్యారంగంలో సరికొత్త పాఠ్య ప్రణాళిక సిద్ధమవుతోందని తెలిపారు. మాతృభాషలో విద్యా బోధనకు సంబంధించి కొంత పురోగతి సాధించినట్టు చెప్పారు. మాతృభాషలో విద్యా బోధన చేయని కారణంగా ఇంగ్లీషు తెలియని విద్యార్థులకు ఘోరమైన అన్యాయం జరిగిందని అన్నారు. ప్రాంతీయ భాషల్లో పాఠ్యపుస్తకాలను అందించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, అది దేశ విద్యా వ్యవస్థలో ఒక పెను మార్పునకు ప్రాతిపదిక అవుతుందని ప్రధాని మోడీ అన్నారు.



## ఖర్దుంగ్లాకు రాహుల్ బైక్ రైడ్

**ప్రపంచంలో అత్యంత ఎత్తైన రహదారిపై కాంగ్రెస్ నేత**

**న్యూఢిల్లీ:** లద్దాఖ్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ ఎంపీ తన బైక్ ట్రిప్‌లో భాగంగా ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ఖర్దుంగ్లా పర్వత రహదారిని సోమవారం చేరుకున్నారు. అక్కడ ఉన్న ఇతర బైక్ రైడర్లతో ఫొటోలు దిగారు. లద్దాఖ్‌లోని లేహ్ జిల్లాలో ఉన్న ఈ ప్రపంచ ప్రసిద్ధి చెందిన రహదారి సింధూ నది లోయను, ష్యోక్ నది లోయను కలుపుతుంది. ఈ రహదారి నుబ్రా లోయకు మార్గ ద్వారంగా ఉన్నది. ఆ తర్వాతనే సియాచిన్ హిమానీనదం ఉన్నది. నుబ్రా లోయకు చేరుకున్న రాహుల్ గాంధీ అక్కడి స్థానికులు, బైక్ రైడర్లతో సెల్ఫీలు దిగారు.

# దారుణంగా ముగిసిన రాజీవ్ ప్రస్థానం

**● మహిళా సాధికారతకు రాజీవ్ అంకితం ● రాజీవ్ గాంధీ జాతీయ సద్భావన పురస్కార ప్రదాన కార్యక్రమంలో సోనియా**



**న్యూఢిల్లీ:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రాజకీయ ప్రస్థానం అత్యంత దారుణంగా ముగిసిందని ఆయన భార్య, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. ఆదివారం జరిగిన 25వ రాజీవ్ గాంధీ జాతీయ సద్భావన పురస్కార ప్రదాన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ''రాజీవ్ గాంధీ రాజకీయ ప్రస్థానం అత్యంత దారుణమైన పద్ధతిలో ముగిసినప్పటికీ ఆ స్వల్ప కాలంలోనే ఆయన అనేక మైలురాళ్లను సాధించారు. దేశ భిన్నత్వం పట్ల ఆయన చాలా సున్నితంగా వ్యవహరించేవారు. మహిళా సాధికారత సాధనకు అంకితమయ్యారు. పంచాయతీలు, మునిసిపాలిటీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడారు. రాజీవ్ గాంధీ కఠోర పరిశ్రమ, దూరదృష్టి కారణంగానే నేడు దేశంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 15 లక్షలకు పైగా ఎన్నికైన మహిళా ప్రతినిధులు ఉన్నారు'' అని అన్నారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఓటరు వయో పరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు మార్చిందని తెలిపారు. కొన్ని శక్తులు విద్వేషం, సామాజిక వేర్పాటు, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుండగా, రాజకీయ పక్షపాతం మరింత చురుగ్గా ఉన్న ప్రస్తుతం కాలంలో మత సామరస్యం, శాంతి, జాతిసమైక్యత అత్యంత కీలకమైనవిగా మారాయని సోనియా గాంధీ అన్నారు. అలాంటి శక్తులు పాలకుల మద్దతును సైతం పొందుతున్నాయని చెప్పారు. భారత్‌లో బహురూపత పరిరక్షణకు ఒక మద్దతుదారుగా రాజీవ్ గాంధీ ఉండేవారని తెలిపారు. ''ధార్మికత, జాతి, భాషా సంస్కృతులను సంబరంగా చేసుకున్నప్పుడే భారత్ సమైక్యత బలోపేతం అవుతుందనే వాస్తవం పట్ల ఆయన ఏమరపాటుగా ఉండేవారు'' అని చెప్పారు.

# ఏపీ జెన్‌కో కేసులో అదానీకి ఊరట

**● కేసు మూసివేసిన సీబీఐ ● సీబీఐ ప్రత్యేక కోర్టుకు క్లోజర్ రిపోర్ట్ సమర్పించిన దర్యాప్తు ఏజెన్సీ ● ఫిర్యాదు చేసిన కేంద్ర మాజీ డిప్యూటీ కార్యదర్శి కౌర్‌కు సీబీఐ నోటీసులు**

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్‌కు(ఏపీజెన్‌కో) దిగుమతి చేసుకున్న బొగ్గును సరఫరా చేసే కాంట్రాక్టు కేటాయింపులో అక్రమాలను చోటు చేసుకున్నాయనే అభియోగాలతో అదానీ ఎంటర్‌ప్రైజెస్, నేషనల్ కోఆపరేటివ్ కన్జ్యూమర్ ఫెడరేషన్(ఎన్‌సీసీఎఫ్) మాజీ ఛైర్మన్ వీరేందర్ సింగ్‌పై దాఖలు చేసిన కేసును సీబీఐ మూసివేసినట్టు అధికారులు తెలిపారు. 2020లో నమోదు చేసిన కేసుకు సంబంధించిన ఒక క్లోజర్ రిపోర్ట్‌ను ఒక సీబీఐ ప్రత్యేక కోర్టుకు దర్యాప్తు ఏజెన్సీ సమర్పించిందని చెప్పారు. ఇదే కేసులో ఎన్‌సీసీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జీపీ గుప్తా, సీనియర్ సలహాదారు ఎస్‌సీ సింఘాల్‌ను సైతం సీబీఐ బుక్ చేసింది. క్లోజర్ రిపోర్ట్‌ను ఆమోదించాలా లేక అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాలు ప్రాతిపదికగా కేసుపై మరింత దర్యాప్తు కోసం క్లోజర్ రిపోర్ట్‌ను దర్యాప్తు ఏజెన్సీకి వెనక్కి పంపించాలా అనే అంశంపై సీబీఐ ప్రత్యేక కోర్టు ఒక నిర్ణయం తీసుకుంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అప్పటి కేంద్ర వినియోగదారు వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రేమ్‌రాజ్ కౌర్ చేసిన ఫిర్యాదు ప్రాతిపదికగా మూడేళ్ళ పాటు ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన సీబీఐ 2020లో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌సీసీఎఫ్ మాజీ ఛైర్మన్ వీరేందర్ సింగ్, తదితరులపై కేసు నమోదు చేసింది. ఫిర్యాదు చేసిన కౌర్ స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారని కోర్టుకు సీబీఐ తెలిపింది. కేసుకు సంబంధించి తదుపరి విచారణకు హాజరు కావాల్సిందిగా కౌర్‌కు దర్యాప్తు ఏజెన్సీ నోటీసులు ఇచ్చింది.

# నేనొస్తే భారత్‌పై ప్రతీకార పన్ను



**వాషింగ్టన్:** భారత్‌లో అమెరికా ఉత్పత్తులపై మరీ ముఖ్యంగా పేరొందిన హార్లీ- డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్ళపై అధిక పన్నుల అంశాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి లేవనెత్తారు. 2024 అధ్యక్ష ఎన్నికల తర్వాత తాను అధికారంలోకి వచ్చిన పక్షంలో భారత్‌పై ప్రతీకార పన్నులు వేస్తానని అన్నారు. ఇటీవల ఒక అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్ లో పన్ను రేట్లపై విరుచుకు పడ్డారు. ''ఇండియా మనఉత్ప త్తులకు అధిక పన్నులు వడ్డిస్తున్నప్పుడు అంతే స్థాయిలో మనం కూడా భారత్ ఉత్పత్తులపై పన్నుల వడ్డించాలి. భారత్ అధిక వడ్డీ రేట్లను హార్లీ-డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్ళ వ్యవహారంలో నేను కళ్లారా చూశాను. ఎందుకంటే మన వాళ్లను ఇండియాలో హార్లీ-డేవిడ్‌సన్ బండ్లను విక్రయిం చమంటే వద్దు సార్ అంటారు. ఎందుకంటే అక్కడ పన్ను రేటు 100 శాతం నుంచి 150 శాతం నుంచి 200 శాతం దాకా ఉంటుంది అని అన్నారు'' అని ట్రంప్ ఆరోపించారు. అదే ఇండియన్ మోటార్‌సైకిల్‌ను అమెరికాలో భారతీయులు విక్రయిస్తే వాటిపై ఎలాంటి పన్ను ఉండదని ఆయన వేలెత్తిచూపారు. అదే ఇండియాలో మన బైక్‌లను అమ్మాలంటే మాత్రం వడ్డీల మోత తప్పదని ట్రంప్ అన్నారు. ఒకవేళ ఇండియాలో పన్నులు పడకూడదనుకుంటే అక్కడ ఒక బైకుల తయారీ ప్లాంట్‌ను నెలకొల్పాల్సి ఉంటుందని అమెరికా మాజీ అధ్యక్షుడు మండిపడ్డారు.

# రూ.300 కోట్లతో బిగ్‌సి విస్తరణ

## 20 వసంతాలు పూర్తి .. మరో 250 స్టోర్ల ఏర్పాటుకు నిర్ణయం

**హైదరాబాద్ :** బిగ్ సీ 20 సంవత్సరాలుగా వినియోగదారుల ఆదరణ పొందుతూ అగ్రస్థానంలో కొనసాగుతుందని సంస్థ వ్యవస్థాపక సీఎండీ ఎం. బాలు చౌదరి చెప్పారు. 2002లో విజయవాడలో బిగ్ సీ మొదటి స్టోర్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో మొబైల్ మార్కెట్ వాటా కేవలం 2 శాతం మాత్రమే ఉందన్నారు. ఒక్కో స్టోర్ ఏర్పాటుకు ఒకటి నుంచి రెండు కోట్ల వరకు పెట్టుబడి అవసరం అవుతుందని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. బాలు చౌదరి చెప్పారు. మొత్తం 300 కోట్ల పెట్టుబడితో విస్తరణ చేపట్టనున్నట్లు చెప్పారు. సంస్థ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బిగ్ సి బ్రాండ్ అంబాసిడర్ మహేష్‌బాబు వేడుకల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం మూడు రాష్ట్రా ల్లో 250 స్టోర్లున్న బిగ్ సి, రానున్న రెండు సంవత్సరాల్లో మరో 150 కొత్త స్టోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మొబైల్ ఫోన్ కొనుగోలు చేయడానికి ముందే దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, వినియోగించే విధానాన్ని వినియోగదారులకు తెలియచేయడం ద్వారా అమ్మకాల్లో బిగ్ సి ఉన్నతమైన ప్రమాణాలను నెలకొల్పిందని చెప్పారు. బిగ్ సీ రెండు దశాబ్దాల ప్రయాణాన్ని పూర్తి చేసుకుని మూడో దశాబ్దంలోకి ప్రవేశించిందని చెప్పారు. ప్రస్తుతం బిగ్ సిలో2,500 మంది ఉద్యోగులు ఉన్నారని, మరో రెండు సంవత్సరాల్లో ఈ సంఖ్య 4,000 వేలకు చేరుతుందని చెప్పారు. ప్రస్తుతం బిగ్ సి కి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రా ల్లో 250కిపైగా స్టోర్లు ఉన్నాయి. 5 కోట్ల మంది వినియోగదారులకు సేవలు అందించినట్లు తెలిపారు. టైయిర్ 4, టైయిర్ 5 ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి మరో 150 స్టోర్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బిగ్ సీ టర్నోవర్ 1,000 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది 1,500 కోట్లకు చేరుతుందని అంచనా. బిగ్ సిలో ఫోన్ ఆర్డర్ చేసిన 90 నిముషాల్లోనే వినియోగదారులకు అందిస్తున్నామని బాలు చౌదరి తెలిపారు. మొబైల్ తయారీ కంపెనీలతో కలిసి వినియోగదారులకు అత్యాధునిక ఫోన్లను అందిస్తున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.స్వన్న కుమార్ చెప్పారు. రానున్న రోజుల్లో 5జీ ఫోన్లు కొత్త రికార్డ్ సృష్టించనున్నాయని చెప్పారు. మొబైల్ ఫోన్ల ఆఫ్‌లైన్ వాటా 65 శాతానికి చేరింది. బిగ్ సి కేంద్రాల్లో ప్రస్తుతం మొబైల్ ఫోన్లతో పాటు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీల అమ్మకాలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్ట్5, శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్5 బిగ్ సిలో ఆవిష్కరించారు. ఈ ఫోన్ల కొనుగోళ్లపై 23,000 వరకు ప్రయోజనాలు ఉన్నాయని ఆయన తెలిపారు.






# జియో ఫైనాన్షియల్ లిస్టింగ్

## 5% తగ్గిన షేర్లు

**ముంబై :** ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి వేరుపడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ సోమవారం నాడు స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యింది. రిలయన్స్ నుంచి ఈ బిజినెస్‌ను గత నెలలో విభజించారు. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ భారీ అంచనాల మధ్య మార్కెట్‌లో ట్రేడింగ్ ప్రారంభించింది. ప్రారంభంలో 1.20 శాతం లాభాతో షేరు 265 రూపాయల వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 262 రూపాయల వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. కొద్ది సేపటి తరువాత జియో ఫైనాన్షియల్ షేర్లు 5 శాతం నష్టంతో లోయర్ సర్క్యూట్‌ను తాకి 248.90 రూపాయల కనిష్టానికి పడిపోయింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు విలువను నిర్ణయించేందుకు గత నెల రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు ప్రత్యేక ట్రేడింగ్ నిర్వహించింది. ఈ ట్రేడింగ్‌లో షేరు విలువను 261.85 రూపాయలుగా నిర్ణయించారు. ఈ విలువతో సోమవారం నాడు షేర్ల ట్రేడింగ్ ప్రారంభించాయి. ఈ షేర్లు ప్రారంభంలో లాభాలు సాధించడంతో కంపెనీ మార్కెట్ విలువ 1.59 లక్షల కోట్లకు చేరింది. 10 ట్రేడింగ్ రోజుల పాటు ఇది టీ గ్రూప్ షేరుగా కొనసాగుతుంది. టీ గ్రూప్ అంటే ట్రేడ్ టూ ట్రేడ్ షేర్లు. వీటిలో ఇంట్రాడేకు అనుమతి ఉండదు. ఈ షేర్లను కొన్న రోజునే విక్రయించలేదు. ఈ షేర్ల విలువ తగ్గినా, పెరిగినా 5 శాతం సర్క్యూట్ పరిమితి ఉంటుంది.






## నేటి నుంచి

# భారత్ ఎన్ క్యాప్

- ప్రారంభించనున్న నితిన్ గడ్కరీ
- ఇక దేశీయంగానే క్రాష్ టెస్టు
- కార్లకు దేశంలోనే సేఫ్టీ రేటింగ్స్



**న్యూఢిల్లీ :** భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (భారత్ ఎన్ క్యాప్) కార్యక్రమాన్ని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం నాడు ప్రారంభించనున్నారు. దేశంలో వాహనాల భద్రతా ప్రమాణాలను 3.5 టన్నులకు పెంచే ఉద్దేశంతో భారత్ ఎన్ క్యాప్‌ను తీసుకు వస్తోంది. ఈ క్రాష్ టెస్ట్ మూలంగా మార్కెట్‌లో సురక్షితమైన కార్ల గురించి కస్టమర్లు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమం కింద కంపెనీలు స్వచ్ఛందంగా కార్లను క్రాష్ టెస్ట్‌కు ఇవ్వాల్సి ఉంటుంది.ఈ టెస్ట్‌ను ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్ (ఏఐఎస్) 197 ప్రకారం జరుగుతుంది. క్రాష్‌టెస్ట్‌లో రెండు రకాల రేటింగ్స్ ఇస్తారు. పెద్దవా రు, పిల్లల భద్రతపై వేరువేరుగా కార్లకు రేటింగ్ ఇవ్వనున్నారు. ఈ స్టార్ రేటింగ్స్ ఆధారంగా కస్టమ ర్లు వివిధ కార్లను పరిశీలించి, తమకు ఏ కారు భద్రత పరంగా మెరుగైన దాన్ని ఎంపిక చేసుకునేందుకు ఇది దోహదపడుతుందని ప్రభుత్వం తెలిపింది. మార్కెట్‌లో సురక్షితమైన కార్ల కొనుగో లుకు కస్టమర్లు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం గ్లోబల్ క్రాష్ టెస్ట్‌కు కంపెనీలు తమ కార్లను పంపించడం ద్వారా ఈ రేటింగ్స్ పొందుతున్నాయి. ఇక నుంచి మన దేశమే సొంతంగా క్రాష్ రేటింగ్స్ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఇండియాలో తయారవుతున్న కార్లకు సెఫ్టీ రేటింగ్స్ ఇవ్వడం వల్ల ఎగుమతులకు అవకా శాలు మరింత పెరుగుతా యని ఆటో ఇండస్ట్రీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం మన దేశంలో టాటా మోటార్స్, వోక్స్‌వ్యాగన్ కంపెనీల కార్లు గ్లోబల్ క్రాష్ టెస్ట్‌లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలకు చెందిన కొన్ని బ్రాండ్స్ అత్యధికంగా ఉండే 5 స్టార్ రేటింగ్‌ను సాధించాయి. ఇండియా కూడా ప్రస్తుతం గ్లోబల్ రేటింగ్ ప్రమాణాల ప్రకారమే రేటింగ్స్ ఇస్తుందని భావిస్తున్నారు. క్రమంగా క్రాష్ టెస్ట్ ప్రమాణాలను పెంచుతారని చెబుతున్నారు. తొలిదశలో కార్లను ఈ టెస్ట్‌కు ఇవ్వడం కంపెనీల ఇష్టంపైనే ఆధారపడి ఉంది. భవిష్యత్‌లో ప్రభుత్వం క్రాష్ టెస్ట్‌ను అన్ని కంపెనీలు, అన్ని మోడల్స్‌కు తప్పనిసరి చేసే అవకాశం ఉంది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు లాభాల్లో ముగిశాయి. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో వరస నష్టాలు ఎదుర్కొన్న మార్కెట్లు, కొనుగోళ్ల మద్దతు, ఐటీ షేర్లు రాణించడంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు చివరి వరకు అదే బాటలో నడిచాయి.

సెన్సెక్స్ 267.43 పాయింట్ల లాభంతో 65216.09 వద్ద ముగిసింది. నిఫ్టీ 83.45 పాయింట్ల లాభంతో 19393.60 వద్ద ముగిసింది. బంగారం 10 గ్రాముల ధర 30 రూపాయలు పెరిగి 58405 వద్ద ట్రేడయ్యింది. వెండికి కిలో ధర 770 రూపాయలు పెరిగి 71005 వద్ద ట్రేడయ్యింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 83.11 రూపాయలుగా ఉంది.

### లాభపడిన షేర్లు

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటాన్ కంపెనీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, నెస్లే ఇండియా, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, విప్రో, కొటక్ మహీంద్ర బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్, హిండాల్కో ఇండస్ట్రీస్, అపోలో ఆస్ప టల్స్, ఎల్‌టీఐమైండ్ ట్రీ, కోల్ ఇండియా, గ్రాసీ మ్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఐచర్ మోటా ర్స్, ఓఎన్‌జీసీ, దివిస్ ల్యాబ్, హీరోమోటోకార్ప్ షేర్లు లాభపడ్డాయి.

### నష్టపోయిన షేర్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం, మారుతీ సుజుకీ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్స్,బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, బీపీసీఎల్, బ్రిటానియా షేర్లు నష్టపోయాయి.

# రుణమాఫీ నిధులు మళ్లించొద్దు!

## బ్యాంకర్లకు మంత్రులు హరీష్‌రావు, నిరంజన్‌రెడ్డి ఆదేశం




**హైదరాబాద్,** అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ రుణమాఫీకి విడుదల చేసిన నిధులను రైతులకు అందజేయాలని, రుణ మాఫీ నిధులను మరొక ఖాతాకు జమ చేసుకోకూడదని బ్యాంకర్లను రాష్ట్ర ఆర్థిక, వ్యవసాయ శాఖ మంత్రులు హరీష్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. అర్హులైన రైతులందరికీ రుణవమాఫీ ప్రక్రియ వర్తించేలా బ్యాంకర్లు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని నిర్దేశించారు. సోమవారం బ్యాంకర్లతో మంత్రులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్ల రుణమాఫీ చేశామని, రెండో విడతలో 30.33 లక్షల మంది రైతులకు రుణమాఫీకి అర్హులుగా గుర్తించి రూ.20,144 కోట్లకు రూ.8089.74 కోట్లు విడుదల చేశామని వివరించారు. రుణమాఫీలో ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. చెమట చిందించే రైతు కుటుంబాల ఆశీర్వాదం బ్యాంకర్ల మీద, ప్రభుత్వం మీద ఉంటుందన్నది తమ ప్రగాఢ విశ్వాసం, నమ్మకమని పేర్కొన్నారు. గతంలో రైతులు రుణాలు ఆశించినా ఇవ్వలేని పరిస్థితిలో బ్యాంకులు ఉండేవన్నారు. కరువు మూలంగా వ్యవసాయరంగ సంక్షోభం మూలంగా ఆ పరిస్థితి ఏర్పడిందన్నారు. నేడు తెలంగాణలో ఏ రైతు కూడా రుణాలను కట్టలేని పరిస్థితిలో లేడని స్పష్టం చేశారు. రైతాంగ శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఆర్థిక భారాన్నైనా మోస్తోందని, దాంతో వ్యవసాయ రంగం బలోపేతం కావడంతో పాటు అనుబంధ రంగాలూ అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో వ్యవసాయం కీలక రంగమని, రాష్ట్ర ప్రగతి జీఎస్డీపీలో 18 శాతం ఆదాయం వ్యవసాయం నుంచే వస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా పేద కుటుంబాలు ఆర్థికంగా బలపడుతున్నాయని చెప్పారు. నికర ఆదాయం, నెలవారీ ఆదాయం లేని కుటుంబాల్లో కూడా ప్రభుత్వ పథకాల ద్వారా డబ్బు మారకం జరుగుతోందని వివరించారు. సగటున పౌరుల చేతుల నుండి జరుగుతున్న రూపాయి మారకం విషయంలో దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణలో ఎక్కువగా ఉందని చెప్పారు. ఈ ఆర్థికచక్రం ముందుకు నడిపించడం మూలంగా అందరి చేతులకు పని దొరుకుతోందన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం మూలంగా ఇది సాధ్యం కాదన్న పిడివాదానికి తెలంగాణలో వ్యవసాయ ప్రగతి ధీటైన సమాధానం చెబుతోందని వ్యాఖ్యానించారు. ఈ దృక్కోణంలోనే సీఎం కేసీఆర్ అనేక రైతు అనుకూల నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. గడిచిన తొమ్మిదేళ్లలో వ్యవసాయరంగం అభివృద్ధి కారణంగానే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమైందన్నారు. రైతులు తమ కాళ్ల మీద తాము నిలబడడంతో ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయిలో ఉండాలన్నది సీఎం కేసీఆర్ అభిలాష అని చెప్పారు.

# షిప్పింగ్ కార్పొరేషన్‌లో పెట్టుబడుల ఉపసంహరణ

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగం లోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ)లో పెట్టు బడుల ఉపసంహరణ ప్రక్రి యు లో కొంత జాప్యం జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆలస్య మైనా ప్రైవేటీకరణ ఆగదని ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. కార్పొరేషన్ ప్రైవేటీకరణ ప్రక్రియ చురుగ్గానే సాగుతుందని ఆ వర్గాలు తెలిపాయి. అనేక దశల్లో ఇది జరగాల్సి ఉన్నందున కొంత జాప్యం జరుగుతుందని వివరించారు. నాన్-కోర్ అసెట్స్‌ను వేరు చేయడమే అతి పెద్ద ప్రక్రియని ఆ అధికారి తెలిపారు. విభజన ప్రక్రియ పూర్తియిన తరువాత కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీంతో కొత్త కంపెనీని లిస్టు చేయనున్నారు.డీమెర్జ్ చేసిన తరువాత షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ల్యాండ్ అండ్ అసెట్స్ లిమిటెడ్ (ఎస్‌సీఐఎల్‌ఏఎల్)ను త్వరలోనే లిస్టు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరుతవాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికేట్‌ను పొందాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలు పూర్తయిన తరువాత వాటాల విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించనున్నారు. వాటాలు కొనుగోలు చేసే ప్రైవేట్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం తన వాటా 63.75 శాతాన్ని, మేనేజ్‌మెంట్ కంట్రోల్‌తో సహా బదిలీ చేయనుంది. దీంతో ప్రైవేటీకరణ ప్రక్రియ పూర్తవుతుంది. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ప్రైవేటీకరణ చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (డీఐపీఏఎం-దీపం) 2020 డిసెంబర్‌లో ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్‌ను ఆహ్వానించింది. 2021 మార్చి నాటికి చాలా కంపెనీలు దీన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేస్తూ బిడ్స్‌ను దాఖలు చేశాయి. కంపెనీకి ఉన్న నాన్-కోర్ అసెట్స్‌లో ప్రధానంగా ముంబైలో ప్రైమ్ ఏరియాలో విలువైన భూములు ఉన్నాయి. ఈ భూములను ఎస్‌సీఐ నుంచి విడదీసి 202 నవంబర్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌సీఐఎల్‌ఏఎల్ కిందకు మార్చారు. షిప్పింగ్ కార్పొరేషన్ రవాణాలో అత్యంత కీలకమైనదిగా ఉంది. భారీ స్థాయిలో ముడి చమురును రవాణా చేయడంతో పాటు, ట్యాంకర్లను కూడా ఉత్పత్తి చేస్తోంది. ఈ సంస్థ కంటైనర్ వెసల్స్‌ను, ప్యాసింజర్ కమ్ కార్గో వెసల్స్‌ను కలిగి ఉంది. ఎల్‌పీజీ గ్యాస్ పరఫరా చేసే నౌకలు ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం షిప్పింగ్ కార్పొరేషన్ విలువ 3,100 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

## వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవం



**వెల్లూరు :** వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) 38వ వార్షిక స్నాతకోత్సవం నిర్వహించారు. కేంద్ర రవాణా శాఖ, పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ వి.కే. సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీఐటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వానాథన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విజయానికి దగ్గర దారి ఏదీ లేదని, ఎంత విజ్ఞానం సంపాదిస్తున్నారు, ఏ మేర కష్టపడుతున్నా దానిపై ఇది ఆధారపడి ఉంటుందని డాక్టర్ వి.కే సింగ్ చెప్పారు. అనేక సమస్యలకు ఒకే పరిష్కారం అన్నదానికి కట్టుబడి ఉండవద్దని, అనేక పరిష్కారాలను తెలుసుకోవాలని ఆయన కోరారు. వీరు చదువుతున్న సంస్థ ఎలా ఉందన్నదానిపై విద్య అబ్బుతుందన్నారు. విద్య ద్వారా ఏం నేర్చుకున్నారు, నేర్చుకున్నదాన్ని ఎలా అన్వయించుకున్నారు, ఎలా మీరు వృద్ధి చెందారన్నదానిపై ఆధారపడి ఉంటుందన్నారు. విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ నిధులు కేటాయించేలా మంత్రి తన పలుకుబడిని ఉపయోగించాలని ఛాన్సలర్ విశ్వనాథన్ కోరారు. దేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కేవలం 27 శాతంగా మాత్రమే ఉందన్నారు. పరిశోధనలపై పెడుతున్న వ్యయాన్ని పెంచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో విప్రో బిజినెస్ ఆపరేషన్స్ గ్లోబల్ హెడ్ సంజీవ్ జైన్, వీఐటీ వైస్ ఛాన్సలర్ శంకర్ విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 8,619 మంది అండర్ గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కు, 278 మంది రిసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు బహూకరించారు.

# ఈపీఎఫ్‌వోలో 17.9లక్షల మంది చేరిక




**న్యూఢిల్లీ :** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)లో ఈ జూన్‌లో కొత్తగా 17.89 లక్షల మంది చేరారు. జూన్‌లో 3,491 సంస్థలు తమ ఉద్యోగులకు ఈ స్కీమ్‌ను విస్తరించాయని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నెల నెలకు ఈపీఎఫ్ఓలో చేరుతున్న ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందని తెలిపింది. మే నెలతో పోల్చితే జూన్‌లో కొత్తగా చేరిన వారి సంఖ్య 9.71 లక్షల మంది ఎక్కువని తెలిపింది. కొత్తగా చేరిన వారిలో 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న వారు 57.87 శాతంగా ఉందని తెలిపింది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువకులు ఈ స్కీమ్‌లో చేరారని పేర్కొంది. పూర్తిగా మొదటిసారి చేరిన 10.14 లక్షల మందిలో మహిళలు 2.81 లక్షల మంది ఉన్నారు. మహిళల సంఖ్య గత 11 నెలల కంటే అధికంగా ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రా ల వారిగా చూస్తే మహారాష్ట్ర, తమిళనాడు అగ్రస్థానంలో ఉన్నాయి. వీటి తరువాత వరసగా కర్నాటక, గుజరాత్, హర్యానా ఉన్నాయి.

# భారీగా విస్తరించినున్న సిట్రాన్ ఈవీ

**న్యూఢిల్లీ:** సిట్రాన్ ఇండియా ఈవీ కార్ల మార్కెట్‌లో భారీగా విస్తరించాలని భావిస్తోంది. ఈ మార్కెట్లో మూడో స్థానానికి చేరుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఫ్రెంచ్ కార్ల తయారీ కంపెనీ అయిన సిట్రాన్ సంప్రదాయ కార్ల మార్కెట్‌లో ప్రవేశించినప్పటికీ ఇప్పటి చెప్పుకోదగిన మార్కెట్ వాటాను సాధించలేకపోయింది. దేశంలో ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సెగ్మెంట్‌లో భారీగా విస్తరించడం ద్వారా బలపడాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ఈసీ3 పేరుతో విద్యుత్ కారును మార్కెట్‌లోకి తీసుకు వచ్చింది. ఈ కారును కంపెనీ పూర్తిగా దేశీయంగానే తయారు చేసింది. మార్కెట్‌లోకి వచ్చిన ఆరు నెలల్లో కంపెనీ 3,000 యూనిట్లను విక్రయించింది. దేశీయ ఈవీ కార్ల మార్కెట్‌లో ప్రస్తుతం తాము మూడో అతి పెద్ద కంపెనీగా ఉన్నామని తెలిపింది. టాటా మోటార్స్, ఎంజీ ఇండియా తరువాత సిట్రాన్ మూడో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. వచ్చే ఆరు నెలలకు డెలివరీలకు వాహనాలు బుక్ అయ్యాయని కంపెనీ ఇండియా హెడ్ సౌరభ్ వత్స తెలిపారు. ఈ కారు ప్రారంభ ధరను కంపెనీ 11.5 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది.ఈ కారు ఒకసారి ఛార్జ్ చేస్తే 320 కి.మీ సర్టిఫైయిడ్ రేంజ్ ఇస్తుందని కంపెనీ తెలిపింది. రియల్ రేంజ్ 240 కి.మీ వస్తుందని పేర్కొంది. కంపెనీ బీ2బీ బిజినెస్‌పై కేంద్రీకరించనున్నట్లు సౌరభ్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ ఢిల్లీ, ముంబై, బెంగళూర్, కోల్‌కతా, హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 44 కేంద్రా ల్లో వీటిని విక్రయిస్తోంది. ఈ సంవత్స రం చివరి నాటికి ఈ సంఖ్యను 75కి పెంచడం ద్వారా అన్ని ముఖ్యమైన నగరాలకు నెట్‌వర్క్ ను విస్తరించి అమ్మకాలు పెంచుకోవాలన కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. గతసంవత్సరం సెప్టెంబర్‌లో టాటా కంపెనీ టియాగో ఈవీని 8.69 లక్షల (ఎక్స్‌షోరూమ్) ధరలో మార్కెట్‌లోకి విడుదల చేసింది. జనవరి నుంచి కస్టమర్లకు డెలివరీలు ఇస్తోంది. ఇప్పటి వరకు 19,000 యూనిట్లను టాటా కంపెనీ విక్రయించింది. టాటా కంపెనీ టిగోర్‌ను 12.49 లక్షలధరలో విడుదల చేసింది. ఈ రెండు కార్లకు పోటీగా సిట్రాన్ ఈ-సీ3ని కంపెనీ విడుదల చేసింది. త్వరలోనే కంపెనీ సీ3 ఎస్‌యూవీ విద్యుత్ కారును మార్కెట్‌లోకి తీసుకురానుంది.

# 22యాప్‌లను తొలగించిన గూగుల్




**న్యూఢిల్లీ :** మాల్‌వేర్ దాడుల నుంచి యూజర్లకు రక్షణ కల్పించేందుకు డెవలపర్ పాలసీని పాటించని యాప్‌లను ప్లేస్టోర్ నుంచి గూగుల్ తొలగిస్తోంది. ఈ నిబంధనలు పాటించని 22 యాప్‌లను ప్లేస్టోర్ నుంచి గూగుల్ తొలగించింది. ఈ యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు గూగుల్ ప్లేస్టోర్ నిబంధనలకు విరుద్ధంగా డేటా సేకరించడంతో పాటు, యూజర్ అనుమతి లేకుండానే డివైజ్‌ను యాక్సెస్ చేసి ప్రకటనలు స్క్రోల్ చేయడం వంటివి చేస్తున్నారని మెకాఫే సైబర్ సెక్యూరిటీ సంస్థ తెలిపింది.దీని వల్ల యూజర్ ఫోన్ బ్యాటరీ ఛార్జింగ్ త్వరగా తగ్గిపోవడంతో పాటు మొబైల్ డేటా త్వరాగా అయిపోతుందని తెలిపింది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి తొలగించిన వాటిలో లైవ్ టీవీ మ్యూజిక్ డౌన్‌డోల్, డిజిటల్ గిఫ్టింగ్, కొరియన్ లైవ్ టీవీ, ఆన్‌లైన్ లైవ్ టీవీ, మ్యూజిక్ రింగ్‌టోన్, సోషల్ మీడియా స్ట్రీమింగ్ కేటగిరి యూప్‌లు ఉన్నట్లు గూగుల్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ యాప్‌లను 2.5 మిలియన్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. యూజర్లు తమ ఫోన్ల నుంచి వెంటనే ఈ యాప్‌లను తొలగించుకోవాలని గూగుల్ సూచించింది. ప్లేస్టోర్ నుంచి తొలగించిన వాటిలో కంపోజ్ మ్యూజిక్ విత్ ఇనుస్ట్రుమెంట్స్, ట్రాట్ మ్యూజిక్ బాక్స్, ఏటీ ప్లేయర్, మ్యూజిక్ ప్లేయర్, ఆడియో ప్లేయర్, పబ్‌జీ మొబైల్ (కేఆర్) ఎమ్‌మ్యూజిక్, ఆన్ ఎయిర్, ఎయిర్‌లైన్ మేనేజర్, లైవ్ ప్లే స్ట్రీమ్‌కర్ లైవ్ స్ట్రీమింగ్, వాచ్ రియల్‌టైమ్ టీవీ డీఎంబీ, కామ్ ఆన్ ఎయిర్, ఆల్ ప్లేయర్, రింగ్‌టోన్ ఫ్రీ మ్యూజిక్, బారో, న్యూలైవ్, బారో టీవీ, బారో, మ్యూజిక్ డౌన్‌లోడర్, మ్యూజిక్ బడా, జిహోసాఫ్ట్ మొబైల్ రికవరీ యూప్, డీఎంబీ యూప్‌లు ఉన్నాయి.

# ప్రజ్ఞానంద సంచలనం

## ఫాబియానోపై విజయం.. ఫిడే ప్రపంచకప్ చెస్ టోర్నీ



**బాకు (అజర్‌బైజాన్):** భారత యువ గ్రాండ్ మాస్టర్ 18 ఏళ్ల ఆర్. ప్రజ్ఞానంద సంచలనం సృష్టించాడు. ఫిడే ప్రపంచకప్ చెస్ టోర్నీలో సోమవారం జరిగిన సెమీస్(టైబ్రేకర్) లో ప్రపంచ 3వ ర్యాంకర్ అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానోకరౌనాపై 3.5-2.5 విజయం సాధించి ఫైనల్లో దూసుకెళ్లాడు. ఇక ఫైనల్లో ప్రపంచ నెంబర్-1 మాగ్నస్ కార్ల్‌సన్‌తో ప్రజ్ఞానంద ఢీ కొననున్నాడు.

# ప్రణయ్, సేన్ శుభారంభం

## శ్రీకాంత్ ఓటమి..ప్రపంచ ఛాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్

**కోపెన్‌హాగెన్ (డెన్మార్క్):** ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. మరోవైపు మాజీ నెంబర్‌వన్ కిదాంబీ శ్రీకాంత్‌తో తొలి రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టాడు. సోమవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్ 24-22, 21-10 తేడాతో కాల్లె కొల్జెనెన్ (ఫిన్లాండ్)పై విజయం సాధించి తర్వాతి రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. ఈ ఫిన్లాండ్ షట్లర్‌పై ప్రణయ్ వరుసగా (3-0) మూడోసారి విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ 21-12, 21-7 తేడాతో మార్షియాస్ షట్లర్ జార్జెస్ జూలియన్ పాల్‌ను వరుస గేముల్లో చిత్తు చేసి రెండో రౌండ్‌లో ప్రవేశించాడు. చెలరేగి ఆడిన సేన్ ఈ మ్యాచ్‌ను 25 నిమిషాల్లోనే ముగించేశాడు. మరో మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-14, 21-14 తేడాతో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

# విజేతలు జకోవిచ్, కొకొగాఫ్

## సిన్సినాటి ఓపెన్ టెన్నిస్



**న్యూఢిల్లీ:** సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్, అమెరికాయువ క్రీడాకారిణి కొకొ గాఫ్ సిన్సినాటి ఓపెన్ టైటిల్‌లను గెలు చుకున్నారు. పురుషుల సింగిల్స్ విభా గంలో జకోవిచ్ విజేతగా నిలవగా..

మహిళల సింగిల్స్‌లో కొకొ గాఫ్ (అమెరికా) తన తొలి డబ్ల్యూటీఏ-1000 లెవల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ నొవాక్ జకోవిచ్ 5-7, 7-6(7), 7-6(4) తేడాతో ప్రపంచ నెంబర్-1 కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. తొలి సెట్‌ను కోల్పోయిన జకోవిచ్ తర్వాతి సెట్‌లో అద్భుతంగా పోరాడి మరో టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. జకోవిచ్‌కు ఇది 3వ సిన్సినాటి ఓపెన్ టైటిల్ కావడం విశేషం. మరోవైపు మహిళల సింగిల్స్ ఫైనల్లో అమెరికా టీనేజర్ 7వ సీడ్ కొకొ గాఫ్ 6-3, 6-4తో ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కారోలినా ముచొవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధిం చింది. టైటిళ్లు సాధించిన జకోవిచ్, కొకొగాఫ్‌లు తాజా డబ్ల్యూటీఏ ర్యాంకిం గ్స్‌లో ఒకొక్క స్థానం మెరుగుపడ్డారు. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్ (పొలాండ్) తొలి స్థానంలో నిలవగా.. అరీనా సాబాలెంగా (బల్గేరియా), జెస్సికా పెగులా (అమెరికా) టాప్ మూడు స్థానాల్లో నిలిచారు. పురుషుల సింగిల్స్ ర్యాంకిం గ్స్‌లో కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) అగ్ర స్థానాన్ని కాపాడుకోగా.. జకోవిచ్ (సెర్బి యా) రెండో స్థానం సాధించాడు. రష్యా స్టార్ మెద్వెదెవ్ మూడో ర్యాంక్‌లో నిలిచాడు.

# రాహుల్, అయ్యర్ బ్యాక్

- తిలక్‌వర్మకు చోటు.. ధావన్, చాహల్‌కు నో ఛాన్స్
- ఆసియాకప్ -2023 జట్టును ప్రకటించిన బీసీసీఐ



న్యూఢిల్లీ: క్రికెట్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూసిన ఆసియాకప్‌వన్డే-2023లో పాల్గొనే టీమిండియా స్క్వాడ్ చివరికి విడుదలైంది. ఆగస్టు 30 నుంచి ఆసియాకప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఢిల్లీలోని తాజ్ హోటల్‌లో భారత సెలక్టర్ల సమావేశం జరిగింది. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు భారత జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా పాల్గొన్నాడు. చర్చల అనంతరం అజిత్ అగార్కర్ సెలక్షన్ కమిటీ 17 మందితో కూడిన టీమిండియా స్క్వాడ్‌ను వెల్లడించింది. సంజూ సాంసన్‌కు రిజర్వ్ ఆటగాడిగా ఎంపిక చేయడం జరిగింది. గాయాలతో చాలా కాలం క్రికెట్‌కు దూరమైన ఓపెనర్ కేఎల్ రాహుల్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ కూడా తిరిగి భారత జట్టులో చోటు సాధించగలిగాడు. మరోవైపు హైదరాబాదీ యువ సంచలనం తిలక్ వర్మ అందరిని ఆశ్చర్యపరుస్తూ భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో సత్తాచాటిన తిలక్ వర్మ జాక్‌పాట్ కొట్టేశాడు. నేరుగా ఆసియా కప్ జట్టులో చోటు సాధించి సంచలనం సృష్టించాడు. మరోవైపు గాయం నుంచి పూర్తిగా కోలుకొని ఐర్లాండ్ పర్యటనలో చెలరేగుతున్న టీమిండియా ప్రధాన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా తిరిగి భారత జట్టులో చోటు అందుకున్నాడు. భారత బౌలింగ్ విభాగానికి బుమ్రా నేతృత్వం వహించనున్నాడు. ప్రస్తుతం ఐర్లాండ్ పర్యటనలో బుమ్రా సారథ్యంలోని టీమిండియా వరుసగా రెండు విజయాలతో మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెస్టిండీస్ సిరీస్‌లో విఫలమైన యువ ఆటగాళ్లు ఐర్లాండ్ సిరీస్‌లో మాత్రం గొప్పగా రాణిస్తున్నారు. సీనియర్ బుమ్రా కూడా పునరాగమనంలో అద్భుతమైన స్పెల్స్‌తో ఆకట్టుకొంటున్నాడు. ఇక బుమ్రాతో పాటు మరో స్టార్ సీనియర్ పేసర్ మహ్మద్ షమీ కూడా భారత బౌలింగ్ దళంలో తన సేవలు అందించేందుకు సిద్ధమయ్యాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఆరంభానికి ముందు గాయంతో జట్టు నుంచి వైదొలిగిన హైదరాబాదీ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ కూడా తిరిగి భారత జట్టులో కలిసాడు. మరోవైపు ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకుర్‌ను సైతం సెలెక్టర్లు ఎంపిక చేశారు. మరో పేసర్ ప్రసిద్ కృష్ణకూడా ఆసియాకప్‌జట్టులో చోటు దక్కించుకున్నాడు. స్పిన్ విభాగంలో మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు ఆల్ రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌కు టీమిండియాలో చోటు లభించింది. మరోవైపుసీనియర్ బ్యాట్స్‌మన్ శిఖర్ ధావన్‌తో పాటు, స్పినర్ యాజువేంద్ర చాహల్‌కు జట్టులో చోటు దక్కలేదు. వీరిద్దరిని ఎంపిక చేయ కపోవడంపై కొందరూ మాజీలు ప్రశ్నలు లేవనెత్తారు.

### పటిష్టమైన బ్యాటింగ్ లైనప్

ఆసియాకప్ కోసం పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌ను ఎంపిక చేయడం జరిగిందని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పేర్కొన్నాడు. శ్రీలంక, పాకిస్తాన్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. ఇక్కడి పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలిస్తాయని అందుకే దానికి తగ్గట్టుగానే టీమిండియా టీమ్ సెలెక్షన్ జరిగిందని ఆయన అన్నాడు. బ్యాటింగ్ విభాగంలో ఎవరేవారున్నారో ఓసారి చూద్దాం. భారత జట్టుకు రోహిత్ శర్మ సారథ్యం వహిస్తుండగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య మరోసారి వైస్ కెప్టెన్ బాధ్యతలను అందుకున్నాడు. ఓపెనర్‌గా రోహిత్ శర్మతో పాటు శుభమాన్ గిల్ బరిలో దిగే అవకాశం ఉంది. గత విండీస్ సిరీస్‌లో అట్టర్ ఫ్లాప్ అయినా గిల్‌కు మరో అవకాశం కలిపించింది. విండీస్ సిరీస్‌లో అతని స్థాయికి తగ్గట్టు రాణించకపోయినా.. అంతకుముందు సిరీసుల్లో అతని రికార్డు బాగనే ఉంది. ఆసియాకప్‌లో మాత్రం గిల్ సత్తాచాటుకుంటాడని సెలెక్షన్ కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఒకవేళ గిల్ విఫలమైతే అతని బ్యాకప్‌గా ఇషాన్ కిషన్‌కి అందుబాటులో ఉంటాడు. వన్‌డౌన్‌లో కేఎల్ రాహుల్ బరిలో దిగుతాడు. వికెట్ కీపింగ్ కూడా రాహుల్ చేయనున్నాడు. గాయం నుంచి ఇటీవల కోలుకున్న రాహుల్ పూర్తిస్థాయి ఫిట్‌నెస్ అందుకు న్నట్లు కనిపిస్తోంది. బెంగుళురులోని భారత శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇతని తర్వాత భారత స్టార్, రన్ మిషన్ విరాట్ కోహ్లీ నాలుగో నెంబర్‌లో బ్యాటింగ్ దిగుతాడు. ఆతర్వాతి స్థానంలో శ్రేయస్ అయ్యర్‌తో పాటు సూర్యకుమార్ యాదవ్‌లు ఉన్నారు. వీరిలో అయ్యర్‌కే అధిక అవకాశాలు ఉన్నాయి. టీ20 స్పెషలిస్ట్‌గా పేరు సాధించిన సూర్యకుమార్‌కు వన్డే రికార్డు మాత్రం బాగాలేదు.

### ఆల్‌రౌండర్లు

వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య గత విండీస్ సిరీస్‌లో నిరాశ పరిచాడు. కానీ ఓవరాల్‌గా ఇతని రికార్డు బాగుంది. బ్యాటింగ్‌లో భారీ షాట్లు.. బౌలింగ్‌లో కీలక సమయాల్లో వికెట్లు తీసే సత్తా ఇతనికి ఉందనడంలో సందేహంలేదు. ఇతనితో పాటు శార్దుల్ ఠాకుర్ కూడా పేస్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ రాణించగలడు. మరోవైపు స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు బ్యాటింగ్‌లో మంచి అనుభవం ఉంది. మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌లో ఇతను చాలా కీలకం. స్పిన్ తో కూడా మంచి ఫలితాలు సాధించగ లడు. ఇక అక్షర్ పటేల్ కూడా స్పిన్‌తో పాటు బ్యాట్‌తోనూ రాణించగలడు.

### బౌలింగ్ దళం..

భారత బౌలింగ్ దళానికి జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహించనున్నాడు. గాయం తర్వాత పునరాగమనం చేసిన బుమ్రా ఐర్లాండ్ సిరీస్‌లో జోరు కనబరుస్తున్నాడు. మరో సీనియర్ పేసర్ మహ్మద్ షమీ భారత జట్టులో కీలకం. ఇతని అనుభవం టీమిండియాకు ఎంతగానో ఉపయోగపడనుంది. మరోవైపు హైదరాబాదీ స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ గత కొంత కాలంగా బుమ్రా గైర్హాజరిలో మంచి ప్రదర్శనలు చేశాడు. మంచి లైన్ అండ్ లెంగ్త్‌తో పాటు కీలక వికెట్లు తీస్తూ టీమిండియా విజయాల్లో కీలక భూమిక వహించాడు. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లోనూ 4వ స్థానంలో కొనసాగుతున్నాడు. మరో పేసర్ ప్రసిద్ కృష్ణబ్యాకప్ బౌలర్‌గా జట్టులో చోటు దక్కించుకు న్నాడు. రెగులర్ బౌలర్లు విఫలమైనా.. గాయాల బారిన పడినా ఇతనికి ఛాన్స్ లభిస్తుంది. ఇక స్పిన్ విభాగంలో చైనామెన్‌గా పేరుసాధించిన మణికట్టుస్పిన్నర్ కుల్దీప్‌యాదవ్ కీలకం. వెస్టిండీస్ పర్యటనలో కుల్దీప్ అద్భుత ప్రదర్శనలు చేశాడు. ఇతర బౌలర్లు విఫలమైనా ఇతను మాత్రం పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు ఎన్నో వికెట్లు పడగొట్టాడు. స్పిన్ విభాగంలో కుల్దీప్ ప్రధాన బౌలర్‌గా సేవలందించనున్నాడు. మరోవైపు ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లు స్పిన్ విభాగంలో కుల్దీప్‌కు సహాయకులుగా ఉండనున్నారు.

**ఆసియాకప్-2023 (వన్డే) భారత జట్టు:** రోహిత్‌శర్మ (కెప్టెన్), శుభ్‌మాన్ గిల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకుర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ కృష్ణ

**బ్యాకప్ ప్లేయర్:** సంజూ సాంసన్.

### జాక్‌పాట్ కొట్టేసిన తిలక్‌వర్మ

హైదరాబాదీ యువ సంచలనం తిలక్‌వర్మ జాక్‌పాట్ కొట్టేశాడు. అరంగేట్రంలోనే అదరగొట్టి ఆసియాకప్ వన్డే టోర్నీలో చోటు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన వర్మ ఆ సిరీస్‌లో అద్భుత బ్యాటింగ్‌తో అందరి ప్రశంసలు పొందాడు. ఆసియాకప్‌లో వర్మకు చోటు ఇవ్వాలని మాజీలు సైతం భారత సెలెక్షన్ కమిటీకి సూచనలు చేశారు. వెస్టిండీస్ సిరీస్‌లో సీనియర్ల గైర్హాజరీలో తనకు లభించిన మంచి అవకాశాన్ని తిలక్‌వర్మ పూర్తిగా సద్వినియోగా పర్చుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 173 పరుగులు సాధించాడు. ప్రస్తుతం ఐర్లాండ్ సిరీస్‌లో విఫలమవుతున్నా.. టీమిండియా సెలెక్టర్లు ఇతనికి గొప్ప అవకాశం కల్పించారు.



# తెలంగాణ యువ జిమ్నాస్ట్‌కు స్వర్ణం



**హైదరాబాద్:** 3వ ఫారోస్ కప్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్ స్వర్ణ పతకం గెలుచుకుంది. ఈజిప్ట్‌లో జరిగిన పోటీల్లో అగర్వాల్ టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో తొలి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈమె కోచ్ మనోజ్ రాణా హర్షం వ్యక్తం చేశాడు.

# ఒలింపిక్ కోట సాధించిన సిఫ్ట్‌కౌర్



**బాకు (అజర్‌బైజాన్):** ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు సత్తా చాటుతున్నారు. సోమ వారం జరిగిన మహిళల 50 మీటర్ రైఫిల్ 3-పొజిషన్స్ ఈవెంట్‌లో సిఫ్ట్‌కౌర్ సామ్రా 10.3తో ఐదో స్థానంలో నిలిచింది. 21 ఏళ్ల కౌర్ క్నీలింగ్‌లో (192), ప్రోనెలో (199), స్టాండింగ్‌లో (192)తో ఓవరాల్‌గా 589 స్కోరు సాధించింది. మరోవైపు కౌర్ ఒలింపిక్స్ కొటను సాధించిన 6వ భారత షూటర్‌గా నిలిచింది.

# ప్రేమ కథా చిత్రాలు చేయాలని ఉంది

## - గాండీవధారి అర్జున హీరోయిన్ సాక్షి వైద్య

వైవిధ్యమైన చిత్రాల్లో నటించే హీరోల్లో వరుణ్ తేజ్ ఒకరు. తాజాగా ఆయన నటించిన థ్రిల్లర్ చిత్రం 'గాండీవధారి అర్జున'. సాక్షివైద్య హీరోయిన్. ప్రవీణ్ సత్తారు దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం ఇదే నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సాక్షివైద్య మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన విశేషాలివే..


సాక్షి వైద్య

- నేను నటించిన ఏజెంట్ సినిమా విడుదలకు ముందే కొన్ని షాట్స్‌ను ప్రవీణ్ సార్ చూశారు. ఐరా పాత్రకు నేను సరిపోతానని భావించారు. అందుకే తీసుకున్నారు. సినిమాలో మంత్రిగా నాజర్ గారి పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఆయన పక్కనే కనిపించే నా పాత్ర చాలా బాగుంటుంది.
- దర్శకులు ప్రవీణ్ గారు సన్నివేశాలను తెరకెక్కించే విధానం ఎంతో క్రియేటివ్‌గా ఉంటాయి. భిన్న రకాలుగా తీస్తుంటారు.
- వరుణ్ తేజ్ పెద్ద కుటుంబం నుంచి వచ్చాడు.. ఎలా ఉంటాడో అని నేను అనుకునేదాన్ని కానీ ఆయన ఎంతో ఒదిగి ఉండేవారు.. నాకు ఈ ప్రయాణంలో ఆయన ఎంతో సాయం చేశారు.
- ఏజెంట్ బాగా ఆడకపోవడం కాస్త బాధ అనిపించింది. టీం ఎంతో కష్టపడి పని చేసింది.. అంత కష్టపడి పని చేసినా ఫెయిల్ అవ్వడం బాధగా అనిపించింది.
- ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ త్వరలోనే మొదలవుతుంది. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్ గారి సినిమాను చేస్తున్నాను.
- దర్శకుడు ప్రవీణ్ గారు చకచకా షూటింగ్ పూర్తి చేయడంతో కనీసం వ్యానిటీకి వెళ్లి రెస్ట్ తీసుకునే టైం కూడా దొరకలేదు. అలా ఫాస్ట్‌గా షూట్ చేయడంతో ఎప్పుడూ ఆ పాత్రలోనే ఉండేదాన్ని.
- సమంత చేసిన యశోద లాంటి సినిమాలు, ప్రేమ కథా చిత్రాలు చేయాలని ఉంది. ఈ సినిమాకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను.
- నిర్మాతలు బాపినీడుగారు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ గారు చాలా మంచి వారు. బాపి గారు ఎప్పుడూ సెట్స్ మీదకు వచ్చేవారు. అందరినీ పలకరించేవారు.
- మిక్కీ జే మేయర్ గారి సంగీతం అద్భుతంగా ఉంటుంది. ఆయన హిందీలో చేసిన పాటలు నాకు చాలా ఇష్టం. ఈ సినిమాకు మంచి పాటలు ఇచ్చారు.
- తెలుగు ప్రేక్షకులు నన్ను చాలా ప్రేమిస్తున్నారు. తెలుగు భాషను నేర్చుకుని అభిమానుల ప్రేమను తిరిగి ఇస్తాను. నాకు తెలుగులో అల్లు అర్జున్ అంటే ఇష్టం. రామ్ చరణ్ గారు నటించిన ఆర్ఆర్ఆర్ సినిమాను చూశాను. మా ట్రైలర్‌ను ఆయన రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. దుల్కర్ సల్మాన్‌తో లక్కీ భాస్కర్, సాయిధరమ్ తేజ్.. సినిమాల్లోనూ నటిస్తున్నాను. రవితేజ గారితోనూ నటించే అవకాశం ఉంది.

INB టైమ్స్ షో



# లండన్ వెళుతున్న ఈగల్

మాస్ మహారాజా రవితేజతో ధమాకా తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఈగల్' చిత్రాన్ని చేస్తున్నారు. ఇప్పటికే చిత్రబృందం విడుదల చేసిన సినిమా టైటిల్ గ్లింప్స్ మంచి స్పందన వచ్చింది. 'ఈగల్' కొత్త షెడ్యూల్ లండన్ లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ లో రవితేజ, ఇతర ప్రముఖ తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్య థాపర్ మరో నాయిక. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగ ణం. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈగల్ చిత్రాన్ని 2024 సంక్రాంతికి విడుదల చేస్తారు.

# ఉస్తాద్...భారీ షెడ్యూల్


షూటింగ్ సెట్లో పవన్ కళ్యాణ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఇంతకు ముందు పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కంబినేషన్ లో 'గబ్బర్ సింగ్' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. మళ్లీ ఇదే కాంబినేషన్ ఉస్తాద్‌భగత్‌సింగ్‌తో రిపీట్ అవుతోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తు న్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' తాజా షెడ్యూల్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం కానుంది.

ఇదిభారీ షెడ్యూల్. పవన్ కళ్యాణ్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. ఈ షెడ్యూల్ కోసం ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి, అతని టీమ్ భారీ సెట్‌ను నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. అయనంక బోస్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

అశుతోష్ రానా, నవాబ్ షా, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్, గౌతమి, నర్రా శ్రీను, నాగ మహేష్, టెంపర్ వంశీ ఇతర తారాగణం.

# మూడో చిత్రానికి శ్రీకారం

'రౌడీ బాయ్స్'తో హీరోగా తెరంగేట్రం చేసిన ఆశిష్ 'సెల్ఫిష్' చిత్రంలో కథానాయకుడిగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా 50 శాతానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే ఆశిష్ మూడో చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ మూవీ రొమాంటిక్ హారర్ బ్యాక్‌డ్రాప్ తో తెరకెక్కనుంది. హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డిలతో పాటు నాగార్జున మల్లిడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అరుణ్



భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో చినబాబు, నాగవంశీ తదితరులు హాజరయ్యారు. కీరవాణి సంగీతం అందిస్తోన్న ఈ సినిమాకు పి.సి.శ్రీరామ్ సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్ల ఆర్ట్ వర్క్ అందిస్తున్నారు.

# రామ్‌చరణ్ కథ అడిగి తెలుసుకున్నారు

## - బెదురులంక నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని

జాతీయ పురస్కారం అందుకున్న కలర్ ఫోటో, తెల్లవారితే గురువారం చిత్రాల తర్వాత లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన సినిమా బెదురులంక 2012. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా నటించారు. క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సి. యువరాజ్ సమర్పకులు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా బెన్నీ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు...



- మీ నేపథ్యం ఏమిటి? మీ గురించి కొంచెం చెప్పండి!

నేను పుట్టిందీ, పెరిగిందీ హైదరాబాద్‌లోనే! సినిమాలు అంటే ఆసక్తి, ఆరేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశా. తర్వాత నిర్మాతగా పరిశ్రమలో ప్రవేశించా.

- బెదురులంక 2012 టైటిల్ పెట్టడానికి గల కారణం?

కథలో ఫియర్ (భయం) కూడా ఓ పాత్ర పోషిస్తుంది. అందుకని, బెదురులంక 2012 అని పెట్టాం. ఓ ఊహాజనిత గ్రామంలో 2012లో 21 రోజులు ఏం జరిగింది? అనేది కథ. మేం చెప్పాలనుకున్న కథను 2012 నేపథ్యం అవసరం.

- క్లాక్స్ కథ చెప్పిన తర్వాత అందులో కోర్ పాయింట్ ఏంటనేది చెప్పేశారు. కథ వినేటప్పుడు మీరు ఏయే అంశాలు చూస్తారు?

కథలో ఎక్స్ ఫ్యాక్టర్ ఉండాలని నేను బలంగా నమ్ముతాను. ప్రేక్షకుడిగా సినిమా చూసినప్పుడు... కొత్తదనం ఉండాలని కోరుకుంటా. కథ కుదిరిన తర్వాత మిగతా అంశాలు అన్నీ కుదురుతాయి.

- హీరో కార్తికేయ గురించి... ఆయనతో ఎలా ఉంది?

చాలా హ్యాపీ! కార్తికేయతో ఏ మాత్రం ఇబ్బంది లేదు. ఆయనతో మళ్ళీ పని చేయాలని అనుకుంటున్నా.

- హీరో క్యారెక్టర్ ఎలా ఉంటుంది?

తనకు నచ్చినట్టు జీవించే పాత్రలో కార్తికేయ కనిపిస్తారు. అతడ్ని సమాజం ప్రశ్నిస్తూ ఉంటుంది. హీరో ప్రేయసి పాత్రలో నేహా శెట్టి కనిపిస్తారు. హీరో హీరోయిన్లు చిన్నప్పటి నుంచి ప్రేమలో ఉంటారు. బతకం, చనిపోతాం అని తెలిస్తే చివరి క్షణాల్లో ఎలా ఉంటాం? అనేది సినిమా కోర్ పాయింట్.

- కథానాయికగా నేహా శెట్టి ఎంపిక ఎలా జరిగింది?

ప్రేక్షకుల్లో ఆ అమ్మాయికి క్రేజ్ ఉంది. డీజే టిల్లులో ఆమె స్క్రీన్ ప్రజెన్స్ బావుంది. అందులో మోడ్రన్, అర్బన్ రోల్ చేశారు. ఆ అమ్మాయితో రూరల్ బ్యాక్‌డ్రాప్ రోల్ చేయిస్తే బావుంటుందని అనిపించింది. లుక్ టెస్ట్ చేసిన తర్వాత హ్యాపీగా అనిపించింది.

- కొత్త దర్శకుడితో చేస్తున్న సినిమాకు టెక్నీషియన్ల పరంగా చాలా పెద్దవాళ్ళను తీసుకున్నారు. కారణం ఏమిటి?

క్లాక్స్ విజన్ స్క్రీన్ మీదకు రావడానికి ఎక్స్‌పీరియన్స్డ్ టెక్నీషియన్లు అవసరం అనిపించింది. సంగీత దర్శకుడిగా మణిశర్మ గారు, ఛాయాగ్రాహకుడిగా సాయి ప్రకాష్ గారు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ఆర్టిస్టుల విషయంలో కూడా.

- సిరివెన్నెల గారితో ఓ పాట రాయించారు కదా! ఆ ప్రయాణం గురించి...

ఆయన పాట రాస్తున్న సమయంలోనే శివైక్యం చెందారు. మాకు ఆ నోట్స్ కూడా మణిశర్మ గారు తెప్పించారు. మిగతా పాటను చైతన్య ప్రసాద్ రాశారు.

- ఈ సినిమా ట్రైలర్ రామ్ చరణ్ విడుదల చేశారు. ఆయన ఏమన్నారు?

ట్రైలర్ విడుదల చేయడానికి ముందు రామ్ చరణ్ గారు కథ ఏంటని అడిగి తెలుసుకున్నారు. ట్రైలర్ చూసిన తర్వాత కాన్సెప్ట్ గురించి మాట్లాడారు. అజయ్ ఘోష్ క్యారెక్టర్ ఎంటరైన తర్వాత సీన్స్ గురించి చెప్పారు. మణిశర్మ గారి మ్యూజిక్ చాలా బావుందన్నారు. ట్రైలర్ చూడటానికి ముందు కార్తికేయ, నేహా శెట్టి పెయిర్ బావుందని చెప్పారు.

# సెప్టెంబర్ 15న రామన్న యూత్



అభయ్ నవీన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా 'రామన్న యూత్'. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 15న విడుదల చేస్తున్నారు. తాజాగా విడుదల తేదీ పోస్టర్‌ను లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ విడుదల చేశారు. ఈ సందర్భంగా డా.జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ - చాలామంది సరైన నాయకుడిని ఎంచుకోకుండా గుడ్డిగా వెంటతిరుగుతారనే బాధ నాకు ఎప్పుడూ ఉండేది. అలాంటి అంశాన్ని సెలెక్ట్ చేసుకొని వినోదాన్ని జోడించి ఒక మంచి సినిమా చేశారు. ఇలాంటి సినిమాలని మనమందరం సపోర్ట్ చేయాలి. అని అన్నారు

హీరో, దర్శకుడు అభయ్ నవీన్ మాట్లాడుతూ - రాజు అనే ఒక యువకుడు పొలిటికల్ లీడర్‌గా ఎదగాలని చేసే ప్రయత్నాలు ఎలాంటి మలుపులు తిరిగాయి అనేది మా రామన్న యూత్ చిత్రంలో ఆసక్తికరంగా తెరకెక్కించాం. అన్నారు.

ఈ చిత్రంలో అభయ్ నవీన్, అనిల్ గీల, శ్రీకాంత్ అయ్యంగార్, తాగుబోతు రమేష్, రోహిణి జబర్దస్త్, యాదమ్మ రాజు, తదితరులు నటిస్తున్నారు.

# నెంబర్ మిస్సింగ్



చంటి, లహరి జంటగా రూపొందుతోన్న చిత్రం 'ఏపీ 31'. "నెంబర్ మిస్సింగ్" అనేది ఉపశీర్షిక. కె.వి.ఆర్ దర్శకత్వంలో నారాయణ స్వామి.ఎం నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు త్రినాథరావు నక్కిన మోషన్ పోస్టర్, బెక్కెం వేణుగోపాల్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో చంటి, హీరోయిన్ లహరి, దర్శకుడు కె.వి.ఆర్ సహా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా..

త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ "ఇప్పుడు చిన్న, పెద్ద సినిమాలనే తేడా లేదు. సక్సెస్ అయితే చాలు. ఈ సినిమా విషయా నికి వస్తే ఏపీ 31 అనేది వైజాగ్ బండి. అంటే ఆంధ్రాలో స్టార్ట్ అయిన ఈ బండి తమిళనాడు వరకు వెళ్లాలి మరి." అన్నారు. నిర్మాత బెక్కెం వేణు గోపాల్ మాట్లాడుతూ ఏపీ 31 సినిమా డైరెక్టర్, నిర్మాతలు పరిశ్రమలో నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. అన్నారు. హీరో చంటి మాట్లాడుతూ- నిర్మాత నారాయణ స్వామిగారు బాగా ఖర్చు పెట్టి సినిమాను చేస్తున్నారు. డైరెక్టర్ కె.వి.ఆర్ గారు, మ్యూజిక్ డైరెక్టర్ ప్రజ్వల్ గారు, రచయిత మ్యాక్ గారు ఇలా అందరూ బాగా కష్టపడుతున్నాం. భాష్యశ్రీ గారు ప్రతి డైలాగ్, పాటను చక్కగా రాశారు. అన్నారు. చిత్ర దర్శకుడు కె.వి.ఆర్ మాట్లాడుతూ- సినీ పరిశ్రమలో పదేళ్లుగా ఉంటున్నాను అన్నారు. రచయిత భాష్యశ్రీ, లహరి కూడా మాట్లాడారు.